ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

57352

అక్టోబర్ 26, 2008

వెలుగుల పండుగ

హ్యాపీబర్త్‌డే

(2008 అక్టోబర్ -26 నుంచి
2008 నవంబర్-1 వరకు)

లీలా వైష్ణవి
1సం॥, అక్టోబర్-27
మాధవి-రామిరెడ్డి
మోదుకూరు-గుంటూరు

పి. మానస
2సం॥, అక్టోబర్-29
జ్యోతి-భూపాల్‌రెడ్డి
కూరెళ్ల-నల్లగొండ

డి. శ్రీహర్షిత-శ్రీజ
అక్టోబర్
సరళ-సతీష్‌కుమార్
చీమలగడ్డ-నల్లగొండ

ఎ. ప్రియదర్శిని
3సం॥, అక్టోబర్-2005
కుమారి-చంద్రమౌళి
విఠల్‌నగర్-కర్నూలు

ఎం. మనోజ్‌కుమార్
2సం॥, అక్టోబర్-2006
భారతి-రంగయ్య
రాచమర్రి-కర్నూలు

ఎ. శ్రీసుజన్
1సం॥, అక్టోబర్-2007
జ్యోతి-బాలకృష్ణ
గౌలిపురా-హైదరాబాద్

ఎ. దివ్య
అక్టోబర్-31
శాంతకుమారి-వీరబ్రహ్మాజి
భవానీపురం-విజయవాడ

పి. వార్షిణి
1సం॥, అక్టోబర్-28
సంధ్య-విజయ్‌కుమార్
పాలకొల్లు-ప॥గో॥

టి. సత్యసాయి దీపక్
5సం॥, అక్టోబర్-2003
రమాదేవి-కనకాచారి
బాలాజినగర్-సికింద్రాబాద్

అవసరమైతే ఆందోళనలు చేయండి



మన అతిథి

పేరు	: ఎ.జానయ్య
పుట్టిన తేదీ	: మే 2
తల్లిదండ్రులు	: ఆల్‌దాస్ జానమ్మ, ఆల్‌దాస్ సైదులు
సొంత ఊరు	: మామిడాల, నల్గొండ
చదువు	: పిహెచ్‌డి, పిడిఎఫ్ (పోస్ట్ డాక్టరల్ ఫెలో)
వృత్తి	: ప్రొఫెసర్, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్.
రోల్‌మోడల్	: నాన్న, ఇంకా... పుల్లారెడ్డి మాష్టారు
మర్చిపోలేని సంఘటన	:మా స్కూల్లో... మాకంటే ముందు పదవ తరగతి పాసయినవాళ్లు ఇద్దరే. దాంతో స్కూల్ అటెండర్ ఎప్పుడూ "మీరు ఎందుకూ పనికి రారు. పాస్ కారు" అని అంటుండేవాడు. దాంతో నాకు పట్టుదల పెరిగింది. ఎలాగైనా సాధించాలన్న పంతంతో బాగా చదివి పాసయ్యా. అప్పుడు అలా మొదలైంది పట్టుదలతో ఏదైనా సాధించాలన్న సంకల్పం.
రచనలు	: హిందూలో పలు వ్యాసాలు ప్రచురితమయ్యాయి. 'దక్షిణాసియాలో వ్యవసాయరంగంపై ప్రపంచీకరణ ప్రభావం ఎలా వుంటుంది?' అన్న పుస్తకం త్వరలో తీసుకురానున్నాను.
అవార్డులు	: ఫిలిప్పైన్స్‌లో అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థలో శాస్త్రవేత్తగా చేశాను. అప్పుడే 'ఉత్తమ శాస్త్రవేత్త' అవార్డు అందుకున్నాను. అమెరికన్ బయోగ్రాఫికల్ ఇనిస్టిట్యూట్ నుంచి 'మేన్ ఆఫ్ ది ఇయర్ 2003' అందుకున్నాను.

మన వ్యవసాయరంగాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇక్కడ కార్పొరేట్ వ్యవసాయం మంచిదికాదు. రైతుల ఆదాయాన్ని, దిగుబడిని పెంచేలా వ్యవసాయం వుండాలి. వ్యవసాయోత్పత్తుల ధరలు, ఖర్చులకంటే 40 శాతం ఎక్కువగా వుండాలి. అప్పుడే వారికి గిట్టుబాటు అవుతుంది. వృత్తి భద్రత పెరగాల్సి వుంది. రైతుల ఆదాయం పెరగాలంటే...పూర్తిగా వ్యవసాయం మీదనే కాకుండా పాడిపరిశ్రమ, పశువుల పెంపకం వంటి వాటిలో కూడా కృషి చేయాలి. ప్రపంచీకరణ తర్వాత ప్రపంచవ్యాప్తంగా రైతాంగం సంక్షోభంలో పడింది. మన ముందర ఎన్నో అవకాశాలున్నాయి. ఆదాయాలు పెంచుకోవాలి. అవసరమైతే ఆందోళనలు చేయాలి. అంతేకాని ఆత్మహత్యలు చేసుకోవద్దు.

ఈ సంచికలో....

టపా	...	2
ఆరోగ్యం	...	8
కార్టూన్లు	...	9
సినిమా	...	10
రుచి	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
సమ్ థింగ్ స్పెషల్	...	17

ఇంకా...

చూద్దామా ... 3

మరపురాని, మరువలేని అనుభూతులు

కథ ...6

రిక్షా సూరిగాడు

విజ్ఞాన వీచిక	...	20
మనసా... తెలుసా	...	21
లాహిరిలో	...	22
కొత్త పుస్తకాలు	...	24



తెలుసుకుందామా ... 18

బుకర్ ప్రైజ్

కథా కమామీషు



అర్థవంతమైన అట్టమీది కథ

12 అక్టోబర్ 2008 ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహలో "నైపుణ్యానికి పదును పెట్టుకోవాలి. ఇంజనీరింగ్ వంటి సాంకేతిక కోర్సులు చేసిన వారికి భారతదేశంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి" అన్న కృష్ణగాంధీగారి విశ్లేషణ అర్థవంతమైంది. విజ్ఞాన వీచికలో చందమామపై తొలి అడుగు అంటూ అమెరికా వాళ్లు చందమామపై కాలు మోపారంటే అది విశేషమే కానీ, నేడు భారతీయుడు చందమామ రావే అనకుండా అక్కడికి నేనే వస్తున్నాను అంటున్నాడు. అంతరిక్షంలో మానవుని విజయాలను చాలా చక్కగా వర్ణించారు. డాక్టర్ కాకర్లమూడి విజయ్ గారికి నా ప్రత్యేక నమస్సులు. బాల వికాసంలో విషయం ఏదైనా సరే పరిమితి మించితే ప్రయోజనాల కన్నా ప్రమాదాలే ఎక్కువౌతాయంటూ అమ్మానాన్నల అతిశ్రద్ధ పసిపిల్లలకు గుదిబండ అనటం పరమసత్యం. అట్టమీది కథలో అవనిపై ఆకలి... ఆపసోపాలు అంటూ తినటానికి తిండిలేని వారు ఎంతమంది? తిన్నది అరగకుండా ఉన్నది ఎంతమంది? అసలు ఆరోగ్యంగా ఉన్నది ఎంతమంది... అంటూ చాలా అంశాలు తెలిపారు. తలా కొంచెం భూమి ఇస్తే అన్నమాట నిజమే. అపుడు నిజంగా ఆకలి మంట ఉండనే ఉండదు. పేదవారు ఆకలికి అలమటించరు, అన్యాయాలకు చోటు ఇవ్వరు.

కర్రా వరప్రసాద్, యలమర్రు.

స్నేహ చాలా చక్కగా ఉంది

అవనిపై ఆకలి... ఆపసోపాలు అట్టమీదికథలో చాలా విషయాలు తెలుసుకున్నాం. ప్రపంచంలోని ఆహార పదార్థాలు విపరీతంగా పెరిగిపోవడం దారుణం. ఒక పూట తిని మరో పూట పస్తులుండి ఆకలి బతుకులతో జీవిస్తున్నారు. మన దేశంలో కడుపు నిండా తిండి లేని వారు ఎందరో ఉన్నారు. పట్టణాల్లో ఈ మధ్య పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తిని పిల్లలు అవస్థకు గురౌతున్నారు. ప్రజలకు ఆకలి తీర్చలేని కొంతమంది పెద్దలు గొప్పలు చెప్పుకొని చేతులు దులుపుకుంటున్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు మంచి ఆహారం అందించాలి. ప్రతి హాస్టల్‌కి ఒక కమిటీ ఏర్పాటు చేయాలి. ఈ మధ్య హైస్కూళ్లలో భోజన పథకాలు ప్రారంభమయ్యాయి. అలాగే ఈ వారం కథ 'ఎర్రబడ్డ పల్లె' బావుంది. మనదేశంలో ఇళ్ల స్థలాలు లేక పేదలు భూమిని ఆక్రమించి వేసుకున్న గుడిసెలను కూల్చివేస్తున్నారు. వివిధ పట్టణ మురికి వాడల్లో ఇటువంటి కుటుంబాలే అధికం. వలస వచ్చే వారిలో కూలి నాలి చేసుకుని బతకటానికొచ్చే పేదలే అధికంగా ఉన్నారు. ఇళ్ల స్థలాలు భిక్షం కాదు, అది వారి హక్కు అనడం బాగుంది. సమ్ థింగ్ స్పెషల్‌లోని అంశాలు మమ్మల్ని ఆశ్చర్యపరిచాయి. బాల వికాసంలో పేర్కొన్నట్టు పిల్లల మీద తల్లిదండ్రులు శ్రద్ధ చూపించాలి. వాళ్లు ఏనిర్ణయాలు తీసుకున్నా పెద్దలు ప్రోత్సహించాలి, ఏరంగంలోనైనా విజేతలుగా తీర్చి దిద్దాలి. ఈవారం స్నేహ చాలా చక్కగా ఉంది.

అనుపోజు సత్య నాగరాజు,
విజయనగరం.

గ్లాస్గో నగరాన్ని చూసిన అనుభూతి కలిగింది

గ్లాస్గో విశేషాలు.. చాలా బాగున్నాయి. ఒక్కసారిగా గ్లాస్గో నగరాన్ని చూసిన అనుభూతి కలిగింది. ఇక్కడ మనవాళ్లు తెలుగు మాట్లాడేందుకు సిగ్గుపడుతుంటే ఎన్నో వేల కిలోమీటర్లు దూరంలో ఉన్న స్కాట్లండ్‌లోని గ్లాస్గో నగరంలో మన తెలుగు వారు తెలుగులో మాట్లాడటం ఆశ్చర్యమనిపించింది. మన వంటలను అక్కడి ఇంగ్లీషు వారు లొట్టలేసుకుంటూ తింటారంటే నమ్మబుద్ధికాలేదు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను మర్చిపోకుండా భారతీయులు అక్కడ ఏకంగా శాశ్వత గురుద్వార్‌ను ఏర్పాటు చేసుకోగలడం చాలా గొప్ప విషయం. దక్కేదుంటే...! కథ చాలా బాగుంది. ఆసాంతం ఆకట్టుకుంది. ప్రాంతీయ యాసలో రాసినా చక్కగా అర్థమయ్యేలా పదాలు ఉపయోగించడం నచ్చింది. స్కాట్లండ్‌లో అన్నికంటే ఎక్కువగా నచ్చిన, ఆకట్టుకున్న విషయం వరకట్నాలు.. కన్యాశుల్కాలు లేవన్నది. నిజంగా ఇది ప్రపంచ దేశాలకు ఎంతో ఆదర్శమైంది. ముందుగా భారతీయులకు. అలాగే పెళ్లి విందుకు కూడా ఎవరి బిల్లు వారే చెల్లించుకోవాలని చెప్పడం నవ్వుతెప్పించింది. అలాగే ఆ దేశంలోనూ అంత అభివృద్ధి



సాధించినా పేదరికం, నిరుద్యోగమూ, మాదక ద్రవ్యాల వినియోగం ఆశ్చర్యకరంగా వుంది. అతి అభివృద్ధి కూడా నిరుద్యోగానికి కారణమేమో అనిపించింది. ఆదివారం అనుబంధంలో అన్ని అంశాలు ఆకట్టుకున్నాయి. ఇంత చక్కటి విశేషాలను ప్రతి వారం మా కోసం అందిస్తున్న ప్రజాశక్తి వారికి ధన్యవాదాలు.

-సింగతల హైమ,
హైదరాబాద్.

చదవదగ్గ పుస్తకం

దేశ రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తున్న సి.పి.ఎం పార్టీ, దాని అధినేత ప్రకాష్ కరత్ గత పదేళ్ల కాలంలో రాసిన వ్యాసాల సంకలనం పాలిటిక్స్ అండ్ పాలసీస్ గ్రంథాన్ని పరిచయం చేసినందుకు ధన్యవాదాలు. సిద్ధాంత విభాగానికి సంబంధించిన వ్యాసాలతో పాటు న్యాయస్థానాల్లో వస్తున్న ప్రజాతంత్ర వ్యతిరేక తీర్పులు, రాష్ట్రాల హక్కులు, భారతదేశ రాజకీయాలు మొదలగు అనేక అంశాలు చోటుచేసుకున్నాయి. రాజకీయ విశ్లేషకులు, వామపక్ష విమర్శకులు అందరూ చదవదగ్గ పుస్తకం.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

*

ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

ఏది ఏది గుమ్మడి పండు ఏది పేరేమి?

ఈ ఫోటో ఓ ప్రముఖ నటిది. జవాబు తెలియాలంటే 20వ పేజీలో చూడండి.

చూద్దామా...

కె. అరుణ

మరపురాని, మరవలేని అనుభూతులు



విహారయాత్ర! ఆ మాటలోనే ఎంతో ఆహ్లాదం దాగుంది కదా! అలాంటి విహారయాత్రకు విజ్ఞానం కూడా తోడైతే? అలాంటి యాత్రనే తలపెట్టింది మా కుటుంబమంతా! మా ట్రిప్ అటు తీర్థయాత్రలానూ ఉండకూడదు, ఇటు కేవలం విహారమూ కాకూడదనుకున్నాక కర్నాటకను మా దసరా విడిదిగా ఎంచుకున్నాం. మొత్తం పన్నెండు మందిమి హైదరాబాదు నుండే బయలుదేరాం. బెంగుళూరులో బయలుదేరినప్పటినుండి తిరిగి బెంగుళూరు చేరేవరకూ ఒక వెహికల్‌ను ఏర్పాటుచేసుకున్నాం. రకరకాల చిరుతిళ్లు తీసుకెళ్లాం కనుక తిండికి ఇబ్బందిపడలేదు. అలాగని అక్కడి రుచుల్నీ వదల్లేదు. దగ్గరదగ్గర రెండున్నరవేల కిలోమీటర్లు పయనించినా, అన్ని వయసులవారున్నా ఏమాత్రం అలసిపోలేదు, విసుగుచెందలేదు. ప్రకృతిలోని అణువణువునీ స్పృశించి పరవశించేందుకు ప్రయత్నించాం!

మేము చూడదల్చుకున్న ప్రదేశాలన్నీ 70శాతం పడమటి కనుమలను చుట్టుకుని ఉన్నాయి. ఇందులో ఆధ్యాత్మికం, చరిత్ర కలగలసిన శ్రీరంగపట్నం, ప్రకృతి అందాలతో కనువిందు చేసిన కూర్గ్, పరవళ్లు తొక్కే కావేరీలో మునిగితేల్చిన నిసర్గధామం, దుబేరా ఫారెస్ట్, హరంగీడ్యామ్, మన దేశంలోనే ఉన్నామా లేక టిబెట్‌కొచ్చామా అనే డైలమాలో పడేసిన బైలకుప్ప గోల్డెన్‌టెంపుల్, కొండవాలు మార్గాల్లో మిరియాలు, కాఫీ, కమలా తోటలతో నిండిపోయిన హొర్నాడు, చిక్కటి అడవుల్లో ఉన్నట్టుండి పచ్చికబయళ్లు నిండిన కొండప్రాంతం కుద్రేముఖ్, అంగరంగవైభవంగా దసరా ఉత్సవాలు జరుపుకుంటున్న శృంగేరి, సాహిత్యానికి పట్టంకట్టిన జ్ఞానపీఠ్‌అవార్డు గ్రహీత 'కువెంపు' నివాసగృహం, అబ్బురపరచిన జలపాతం జోగ్‌ఫాల్స్, కేవలం విద్యుదుత్పాదనకే వినియోగిస్తున్న షెరావతినదిపై నిర్మించిన లింగన్‌మక్కి డ్యామ్, నిబిడాశ్చర్యానికి గురిచేసిన ఆలయాలు బేలూరు, హలిబీడు ఉన్నాయి. పడమటికనుమల కొండకోనల్లో సాగిన ఈప్రయాణంలో ప్రకృతిలో తడిసిముద్దయ్యాం. తన్మయత్వానికి లోనయ్యాం. మబ్బుల్లో తేలియాడాం. వెన్నెల్లో మునిగితేలాం. ఇదీఅని చెప్పలేని తాదాత్మ్యతలో జారుకుని అనిర్వచనీయ అనుభూతికి గురై, ఉక్కిరిబిక్కిరై, మనసునిండా ఎన్నో భావాలను, శక్తిని, ఉత్తేజాన్నీ నింపుకున్నాం. కళ్లనిండా ప్రకృతి వర్ణచిత్రాలను మూటకట్టుకున్నాం.

వీటిలో ఇప్పుడు మనం చెప్పుకునేది బేలూరు, హలిబీడు గురించి! 'అమరశిల్పి జక్కన' గురించి చాలామందికి తెలిసే ఉంటుంది. చక్కని సినిమా ఉంది మరి! చిన్నప్పుడా సినిమా చూసినప్పటినుండి ఆ ఆలయాలను చూడాలన్న ఆశ ఇన్నేళ్లకి నెరవేరింది. అక్కడకు ముందురోజు రాత్రికే చేరుకున్నాం. గదులను నెట్‌లో ముందే బుక్ చేసేసుకున్నాం కనుక సీజనల్ సమస్య లేదు.

పొద్దున్నే నాలుగున్నరకల్లా అందరంలేచి చకచకా రెడీ అయిపోయి ఆరింటికల్లా బేలూరు గుడి ముందున్నాం. తీరా చూద్దుంకదా! గుడి ఏడున్నరకు గానీ తెరవరట! ఏం చేస్తాం? ఈలోగా కాఫీ, టిఫిన్లు కానిచ్చేశాం! ఇదంతా ముగిసేసరికి గుడి తలుపులు తియ్యనే తీశారు.







తెరుస్తున్న తలుపుల మధ్య ఒక్కసారిగా మరో ప్రపంచం సాక్షాత్కరించినట్లయింది. అంత అద్భుతంగా ఉన్నదా గుడి!

చరిత్ర కెళితే..!

కర్నాటక రాష్ట్రంలోని హసన్‌జిల్లాలో చిన్న పట్టణం 'బేలూరు'. 11వ శతాబ్దంలో 'హొయసల' సామ్రాజ్యాధినేత విష్ణువర్ధనుడు చెన్నకేశవునికి ఆలయం నిర్మింపజేశాడు. చెన్నకేశవుడు అంటే 'సౌందర్యవంతుడైన విష్ణువు' అని అర్థం! ఆ సౌందర్యం ఆలయంలో అణువణువునా తొణికిసలాడుతుంది. జక్కన ముందుగా ఒక ఆలయాన్ని నిర్మించినా, అది నచ్చక దానిపక్కనే మరో పెద్ద చెన్నకేశవాలయాన్ని నిర్మించాడు. ఇది అనేక శిల్పాలు, తోరణాలు, స్థంభాలు, ప్రాకారాలు కలబోసిన ఆలయం. 'హొయసల' సామ్రాజ్య చిహ్నం సింహాన్ని చంపుతున్న మనిషి! ఈ చిహ్నమే ఆలయానికి ఇరువైపులా కొలువుతీరి ఉంటుంది.

ఇక్కడున్న శిల్పాలు, స్థంభాలు, గోడలు ఏదీ మరొకదాన్ని పోలి ఉండదు. దేనికదే విభిన్నరీతిలో ఆకట్టుకుంటుంది. వీటిపై అందమైన అతివలు, జంతువులు, పక్షులు, లతలు, తీగలు అత్యద్భుతంగా మలచబడి ఉన్నాయి. రామాయణ, మహాభారతాలు ఎంతో వివరణాత్మకంగా చెక్కబడ్డాయి. ఆలయం నక్షత్రాకృతిలో ఉంది. గర్భగుడి మధ్యభాగాన గుండ్రని వేదిక ఉంది. ఆరోజుల్లో అక్కడ దేవదాసీలు నృత్యం చేసేవారట! దానికి గుర్తుగా చుట్టూ 'సాలభంజిక'లను అత్యంత రమణీయంగా చెక్కి నిలిపారు. ప్రతి శిల్పాన్ని చెక్కిన తర్వాత గుడి ప్రాకారాలపై అమర్చారు.

అతివలు సౌందర్యాభిలాషులని పేరు! హొయసల సామ్రాజ్యంలోని వారికి దీనిపై గట్టి నమ్మకమే ఉన్నట్లుంది. ఇక్కడ చాలావరకూ శిల్పాలలో అతివలదే అగ్రస్థానం! శిల్పాల్లో స్త్రీలు అద్దం చూసుకుంటూ, అలంకరించుకుంటూ...అనేక రకాలుగా కనిపిస్తారు. ప్రతీ శిల్పంలోనూ ఒంపుసొంపులు, హొయలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. వారి కనులలో భావాలు, వస్త్రధారణ, కాలిఅందెలు, హారాలు, చెవికమ్మలు, గాజులు...ఒక్కటనేమిటి ప్రతిదీ మనలను విభ్రమపరుస్తుంది. నిజమైనవేమోనన్నంతగా మనల్ని ఏమారుస్తాయి! ఇలాంటి అతివల విగ్రహాలు అక్కడ 42 ఉండగా అందులో 38 గుడి బయట, 4 గుడి లోపలా ఉన్నాయి. ఇలాంటి శిల్పాలన్నింటిలోనూ 'దర్పణసుందరి' బాగా పేరెన్నికగన్న శిల్పం. మరొకదానిలో ఒక యువతి చీర కట్టుకుంటుంటే చీరను లాగేస్తున్న కోతిని కర్రతో కొట్టాలని కొమ్మ విరుస్తూ ఉంటుంది. అప్పుడా యువతి ఎత్తిన కాలినుండి విడివడిన చెప్పు, తెరిచిన నోటిలోని పళ్లు, ఎంతో చక్కగా చెక్కారు. అలాగే నృత్య భంగిమలు, వాయిద్యాలతో స్త్రీలు, అలంకరించుకుంటున్న లతాంగులు ఎందరో కనిపిస్తారు.

ఈ శిల్పాలన్నిటినీ 'సోప్‌స్టోన్'తో మలిచారు. ఆ రాయి భూమినుండి తీసినపుడు మెత్తగా ఉంటుంది. చెక్కిన పిమ్మట గట్టిపడిపోతుంది. ఎంత గట్టిగానంటే నేటికీ చెక్కు చెదరనంత! ఆలయం, శిల్పాలు సోప్‌స్టోన్‌తో కాగా, గర్భగుడిలోని చెన్నకేశవుని విగ్రహం నల్లరాయితో చెక్కారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద స్థూపం ఉంది. అంత పెద్ద స్థూపానికీ ఆధారం ఒకవైపు మాత్రమే ఉంటుంది. ఇన్ని వందల సంవత్సరాలుగా గాలికీ, వానకీ తట్టుకుని అలాగే నిలిచిఉన్న ఈ స్థూప నిర్మాణం ఆనాటి సాంకేతికతకు, శిల్పుల పనితనానికి నిలువెత్తు దర్పణం!

ఇవే అద్భుతం, రమణీయం అనుకుంటే 'హలిబీడు' అందాలు వర్ణనాతీతం! జక్కన బేలూరు ఆలయ నిర్మాణం కావించిన తర్వాత ఒక శిల్పంలో లోపముందని స్వయాన అతని కొడుకే లోపాన్ని ఎంచుతాడు. ఆ శిల్పాన్ని పగులగొట్టగా అందులోనుండి కప్ప బైటికొస్తుంది. అప్పటివరకూ తానే గొప్ప శిల్పిననుకున్న జక్కన పశ్చాత్తాపబడి చేతులు నరుక్కుంటాడు. పిమ్మట రాజు జక్కన కొడుకును 'హలిబీడు'లో ఆలయాన్ని నిర్మించమంటాడు.

హలిబీడు

బేలూరు విష్ణు ఆలయంకాగా, హలిబీడులోనిది శివాలయం. ఇది బేలూరు గుడి వలెనే ఉంటుంది కానీ ఇందులోని శిల్పాలు అక్కడికంటే లలితంగా, సున్నితంగా, హావభావాలు ప్రస్ఫుటంగా అగుపిస్తాయి. బేలూరు గుడికంటే హలిబీడు పెద్దది. ఇది శివాలయం కనుక ఇక్కడ రెండు పెద్ద నందులున్నాయి. ఇవి దేశంలోనే ఆరవ, ఏడవ పెద్ద నందులు. వాటి మెడలో



గంటలు, హారాలు, కంటినీరు అన్నీ వివరంగా మలచిన శిల్పుల కళాభిరుచి అబ్బురపరుస్తుంది.

బేలూరు ఆలయం లోపల నిర్మాణాలకు పేరుగాంచితే, హలిబీడు బైటి శిల్పకళకు పేరెన్నికగన్నది. 'హలిబీడు అంటే శిథిలమైన నగరమని అర్థం. నిజానికి ఈ నగరం అసలు పేరు 'ద్వారసముద్రం'. 12వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయాన్ని 13వ శతాబ్దంలో ముస్లిం రాజులు 'మల్లి కాఫూర్', 'మొహమ్మద్ బీన్ తుగ్లక్'లు దోచుకుని, నాశనంచేశారు. అప్పటినుండి ఇది 'హలిబీడు'గా మారింది.

హలిబీడులో శిల్పచాతుర్యం అనన్యమైనది, అసామాన్యమైనది. ప్రతీ శిల్పంలోనూ జీవం తొణికిసలాడుతుంది. ఆలయంచుట్టూ అంచెలంచెలుగా శిల్పాలుంటాయి. క్రిందివరుసలో ఏనుగులు ఆలయాన్నంతా మోస్తున్నట్లుంటాయి. రెండువేల పైచిలుకున్న ఈ ఏనుగులను బలానికి చిహ్నంగా చెక్కారు. దానిపై సింహాలు శౌర్యానికీ, వాటిపై అశ్వాలు వేగానికి, వాటిపై మకర అనే ఊహాజంతువు, అన్నిటికన్నా పైన నెమళ్లు సౌందర్యానికి చిహ్నాలుగా మలిచారు. వీటిలోని 'మకర'అనే ఊహాజంతువు ఏనుగుతొండం, ఆవుచెవులు, మొసలినోరు, కోతికళ్లు, పందిశరీరం, సింహంకాళ్లు, ఎలుకగోళ్లు, నెమలితోకలతో విచిత్రంగా అలరారుతుంది. అన్ని జంతువులలోని విశిష్టలక్షణాలను కూర్చిన ఈ జంతువును సైనికులకు ఆదర్శప్రాయంగా తయారుచేశారట!

ఇక్కడున్న గొప్ప శిల్పాలలో గోవర్ధనగిరినెత్తిన గోపాలుని విగ్రహం ఒకటి. ఎత్తిన గోవర్ధనగిరిపై గుహలోనుండి తొంగిచూస్తున్న సింహం, గుహలోకెళుతున్న పులి, చెట్టెక్కుతున్న కోతి, పాకుతున్న బల్లి, పందిని వేటాడుతున్న యువకుడు, పురివిప్పిన నెమలి...ఇంకా ఎన్నో కనిపిస్తాయి. అలాగే నర్తిస్తున్న యువతి ఎగిసిన కనుబొమలు, ఎత్తిన అరిపాదంపై ముడతలు, పదునైన నఖాలు, హావభావాలు అద్భుతంగా ఉంటాయి. శివుడు ఏనుగు శరీరంలో నాట్యం చేసే విగ్రహంలో శివునిగోళ్లు ఏనుగు చర్మంలోనుండి చొచ్చుకుని బైటికిరావడం విచిత్రమనిపిస్తుంది. ఇంకా కాలభైరవుడు తలనరకగా పడుతున్న రక్తాన్ని తాగుతున్న శునకం, శివపార్వతులిద్దరూ తనపైకెక్కగా బరువును తాళలేక ఉగ్రరూపంతో నున్న నంది, నర్తిస్తున్న వినాయకుని బరువును మోయలేక గుడ్లుతేలేసిన మూషికం నేలలోకి కుంచించుకుపోవడం వంటివన్నీ మనల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచుతాయి.



ఆనాడే ఇంత ముందుచూపా!

ఇవేకాక స్ట్రాలోనుండి పానీయాన్ని తాగుతున్న పూబంతులు, బైనాక్యులర్స్‌నుండి చూస్తున్న ముదితలు, మిస్సైల్స్ పంపుతున్న సైన్యం, నేటి హెల్మెట్ ధరించిన సైనికులు ఆనాటి శిల్పుల సృజనాత్మకతను, కళాకృషిని పట్టి చూపించింది. అక్కడ బ్రిటిష్ న్యాయమూర్తుల వస్త్రధారణలోనున్న ఒక మనిషి శిల్పం ఉంది. ఆలయం 12వ శతాబ్దంలోనిది కాగా, 18వ శతాబ్దంలో ఆంగ్లేయులు దీన్ని చూసి అనుకరించారని అక్కడ చెపుతారు. భారతదేశాన్ని ఆక్రమించిన తెల్లవారు ఈ ఆలయంలోని శిల్పసంపదను లెక్కలేనంత దోచుకుపోయారు. అవన్నీ ఇప్పుడు లండన్ మ్యూజియంలో కొలువుతీరాయి.

ఇవన్నీ విభ్రమచెందుతూ, అచ్చెరువొందుతూ, కొండొకచో ఆశ్చర్యపోతూ, తన్మయమౌతూ మనం ఒక అలౌకిక భావానికి లోనవుతాం. ప్రతీ శిల్పాన్నీ తడిమిచూస్తాం. తాకి ఆ లావణ్యాన్ని అనుభవిస్తాం.

ఈరోజుల్లా మౌల్డుల్లో వేసి అనేక విగ్రహాలు తయారుచేసే విధానం ఆనాడు లేదు. ప్రతీ శిల్పాన్ని ఉలితో చెక్కవలసిందే! ప్రతీ రాయినీ ఏకాగ్రతతో మలచవలసిందే! దానికెంత నేర్పు, ఓర్పు కావాలో కదా! ఊహకే అది అద్భుతమనిపిస్తే నిజంగా మన కళ్లముందు నిలిచిన ఈ శిల్పాలకూ, చెక్కిన శిల్పులకూ నీరాజనాలర్పించాల్సిందే!

'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలిలెవ్వరు'అన్నట్లుగా ఈ ఆలయనిర్మాణానికి పనిచేసిన శిల్పులెందరో? అలాగే 'రాజుల సొమ్ము రాళ్లపాలు' అంటారు! కానీ ఈ బేలూరు, హలిబీడు శిల్పసంపద అలా మట్టిలో పోసిన పన్నీరు కాదు, కాబోదు. ఇది చిరస్థాయిగా నిలిచిపోయే కళాఖండం! ప్రజల హృదయాలలో కొలువుతీరే పనితనం! అందుకే ఇది శతాబ్దాలుగానే కాదు, ఇప్పటికీ ఎందరో పర్యాటకులను, విదేశీయులను ఆకట్టుకుంటోంది.

తిరిగొచ్చినా మా మనసు ఇప్పటికీ అక్కడే ఊగులాడుతోంది. కనులముందు ఇప్పటికీ ఆ శిల్పచాతుర్యం, వారి సృజనాత్మకత కదలాడుతూనే ఉంది. ఇవి మరువలేని, మరపురాని అనుభూతులు!



రిక్షా సూరిగాడు

కథ

యర్నాగుల సుధాకర రావు

"వాళ్లను ఈజన్మలో మరిచిపోను.వారు పశువులకంటే హీనం. నావంటి వాడిపై దాడిచేయడం అమానుషం. నేను తలచుకుంటే వారిని ఏమైనా చేయగలను. వారిని పట్టుకోవడం నాకు పెద్దపనికాదు. కోర్టు బోనులో నిలపగలను.అలా చేస్తే నాకు ఏమిలాభం? నాఎడమచేయి చచ్చుపడింది.ఇక నేను రిక్షా లాగడానికి పనికిరాను. రోజూ రైల్వేస్టేషన్ రోడ్డులో చేయిచాచి అడుక్కోవడమే. అలాంటి హీనస్థితిలో నన్ను ఆ ఇద్దరు చూసి "అయ్యో మావలన ఇతడికి చేయి చచ్చుపడింది. చివరికి పొట్ట కోసం యాచనకు దిగాడా!!" అని ఏమాత్రం బాధపడినా నాకదే చాలు. వారిలో ఆమార్పు కోరుకుంటున్నాను.

అర్ధరాత్రివేళ రిక్షాతిప్పే సూరిబాబును పెట్రోలింగ్ పోలీసులు పట్టుకుని రిక్షా టైరుల్లో గాలితీసేసారు. "ఊరినిండా దొంగలు పడిదోచు కుంటున్నారు. రాత్రిళ్లు ఎవడూ రిక్షా నడపద్దు. దొంగనాయాళ్లు మూటలతో వచ్చి రిక్షాఎక్కితే ఇక్కడివారా కాదా అనిచూడకుండా రైల్వేస్టేషన్‌కు చేరుస్తున్నారు. ప్రతి రిక్షావాడికి చెప్పడం కుదరదు.మీకో సంఘం ఉండి ఏడ్చింది కదా! ఆ ప్రసిడెంటుకు చెప్పాం. ఏమిరా నీకు బొట్టు పెట్టి చెప్పాలా బోషిడికా!" లాఠీతో సాచి రెండుకొట్టి రిక్షాను తలకిందులు చేసి చేతులు దులుపుకుని వెళ్లిపోయారు. సూరిబాబుకు లాఠీదెబ్బలతో ప్రాణాలు విలవిలలాడాయి. రోడ్డు మీద ఒక మూలకు చేరి దెబ్బలను తడుముకున్నాడు. ఆవెంటనే రిక్షాను మెల్లగా యధాస్థానంలో నిలిపి మూడు టైర్లుకు రాళ్లు అడ్డంపెట్టి తుండు గుడ్డ వేసుకుని నేలమీద పడుకున్నాడు. దెబ్బల వలన నోరు ఆర్చుకుపోయి నిద్రపట్టేసింది. పిట్టల అరుపుకు లేచాడు.చీకట్లు విడిపోతున్నాయి. రాత్రివేళ రిక్షా తిరుగాడితే వందోయాబయ్యో వచ్చేది. సీటుకింద ఉన్న గాలిపంపు తీసి గబగబా గాలికొట్టాడు. ఎడమచేయి పట్టుతప్పినట్టు అన్పించింది. లాఠీ దెబ్బలు తడుముకున్నాడు. పచ్చిపుండులా ఉందా దెబ్బలచోటు. అప్పటికే చెట్టుకిందకు చేరుకుంది టీ అమ్మేముసల్ది. స్టవ్ ముట్టించి టీ తయారు చేస్తోంది. తనని చూడగానే తన మనవరాలితో ఒక టీ పంపింది.

అప్పుడు గుర్తుకు వచ్చింది తనవద్ద రూపాయి లేదని వెంటనే టీగ్లాస్ తీసుకువెళ్లి ముసల్దాని ముందు పెట్టి "రాత్రి రిక్షా వెయ్యలేదు.నాదగ్గర డబ్బుల్లేవు. అరువు పెడదామంటే నీవు నాలోటోడ్ని నమ్మవు. అందుకే తిరిగి ఇచ్చేస్తున్నాను." గ్లాసు ఇచ్చేసి వెనుదిరిగాడు.

రిక్షాకు బేరమేమైనా వస్తుందా అని ఎదురుచూడసాగాడు. అలా చూస్తుండగానే చీకటి పూర్తిగా కరిగిపోయింది. ఒక్క బేరం తగల్లేదు. అంతలోనే రిక్షాలు ఎదురుగా వస్తుంటే గుండెలు గుబగుబలాడాయి. తల విసురుతున్నట్లుగా ఉంటే రిక్షాలో కూర్చున్నాడు. దారితప్పినట్టు గ్రామ సర్పంచ్ వచ్చాడు. అతడిని రిక్షా ఎక్కించుకుని తొక్కాడు. గ్రామం చేరుతుండగా మరింతగా కళ్లు తిరగసాగాయి. గట్టిగా తలవిదిలించాడు.

"ఏట్రా రిక్షా పాములా తిప్పుతున్నావు. రాత్రి తాగింది దిగలేదా? ఎందుకురా రాత్రిపగలు కష్టపడి, సంపాదించింది చీప్‌లిక్కర్‌కి తగలే స్తారు. అందుకేరా మీకు ఏరోగమొచ్చినా ఎవడూ జాలిపడడు. ఎంత తాగేసినావో ఏటో? అక్కడ సారాకంపు ఇక్కడికి వస్తోంది." అని ముక్కు మూసుకున్నాడు.

ఆమాటలకు తల తిప్పి వెనక్కి చూశాడు సూరిబాబు.

"ఏట్రోయ్ ఏదో పొడిచేసినట్లు చూస్తన్నావు.రిక్షా తగలెట్టేసి ఊదే స్తాను. తాగుముచ్చు నాకొడకా!తల తిప్పుకోరా !" కోపంతో ఉరిమాడు.

ఆదారిన నడుస్తున్నవారు "ఏట్రా భద్రయ్యా ఎందుకురా రిక్షా వోడితో గొడవ. ఆడి మీద ఏట్రా నీకు అంత గుస్సా. ఆడిని ఏటి సేసీకురా మొదటి తప్పు క్షమించేయరా!" అని నవ్వుతూనే చురక అంటించారు.

మెల్లగా రిక్షాను గ్రామంలోకి తీసుకుపోయాడు. సర్పంచ్ భార్య ఎదురొచ్చి "నువ్వు మారవుగాక మారవు. పట్టనానికి పోయి పీకమొయ్య తాగేసి, ఏసానికొంపల్లోనో గడిపి తీరుబాటుగా తెల్లారగట్ల వస్తే ఇక్కడ నీకోసం పనులు ఆగుతాయా?" రోడ్డుమీద నిలదీసింది.

"ఇదో ముదనష్టపు మనిషి. దీనికి ఎంత మాటొస్తే అంతే అంటాది. మొగుడు రాజకీయంచేసి ఎనకేస్తన్నాడనిలేదు. నాతాగుడు నాయవ్వారాలు ఆరాలు తీయడం దీనిపని.దీనికి ఏదోరోజు ఒళ్లు ఊనం చేసే వరకు నిద్రపోను" అని కోపంగా చూసి తప్పటడుగులు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్లిపోయాడు.

అప్పటికే కళ్లు తిరగడం ఎక్కువయి సూరిబాబు విరుచుకు పడిపోయాడు. సర్పంచ్ భార్య చూసి "ఈడొకడు నాయజమానికి మించి తాగేసినట్టున్నాడు. మాయదారి సొద." ఈసడించుకుని లోపలికి వెళ్లి పోయింది. గ్రామం అంతా కనుక అక్కడ పోగయ్యారు. "రిక్షావోడికి మనసర్పంచ్ ఇప్పిస్తే కన్ను మిన్నూ కానకుండ తాగేసి ఇక్కడివరకు రిక్షాలాక్కొచ్చి పడిపోనాడురా !"అని అనుకుని చెట్టుకిందకు ఈడ్చేశారు. మధ్యాహ్నం వరకు అలానే పడున్నాడు సూరిబాబు.

ఆఊరి సంచి వైద్యుడు రామలింగం ఆదారినపోతూ "ఈడు రిక్షా సూరిగాడిలా ఉన్నాడు.ఎందుకు ఇలా పడుకున్నాడు. ఏమయ్యింది? అక్కడవారిని ఆరాతీశాడు.

"ఈడు మన సర్పంచ్‌తో పీకమొయ్య తాగేసి ఇలా పడిపోయాడు. మరికొద్దిసేపటిలో లేచికూర్చుంటాడు" ఒకడు నవ్వుతూ చెప్పాడు.

తాగినట్లుగా లేదే అని తడిమాడు. "వీడికి జ్వరంతో ఒళ్లు కాలిపోతోంది. వీడు తెలివిలో లేడు. ఎలాగైనా ఆసుపత్రికి చేర్చాలి. లేకుంటే ఛస్తాడు" అక్కడి వారికి చెప్పి తనకు తెలిసిన ఇంజక్షన్ ఒకటి ఇచ్చాడు.

అక్కడ పలువురు పోగయ్యారు. కుడిభుజంమీద పెద్ద తట్టులా లాఠీ గాయం వాచిపోయిఉంది. "వీడిని ఎవరో తీవ్రంగా కొట్టినందునే ఇలా

జ్వరంవచ్చింది.సరే ఏదైనా ఏర్పాటుచేయండి. నేనే ఆసుపత్రికి తీసుకు వెళ్తాను." అని అక్కడివారికి చెప్పాడు.

సూరిబాబు రిక్షాను ఆగ్రామస్తుడు ఒకడు తొక్కాడు. అందులో సూరిబాబును వేసుకుని ఆసుపత్రికి తీసుకువెళ్లి జాయిన్ చేశాడు రామలింగం. వెంటనే వారు ఒకసెలైన్ ఎక్కించారు. రామలింగం సూరిబాబు ఇంటికి కబురంపాడు. సూరిబాబు భార్యా, కొడుకులు ఇద్దరు ఉరుకులు పరుగులతో వచ్చారు. డాక్టర్లు ఏవో మందులు రాస్తే అవి కొని ఇచ్చారు.

రిక్షా కార్మిక నాయకులు ఆసుపత్రికి చేరుకున్నారు.సూరిబాబు పరిస్థితిపై ఆరాతీశారు. అతడు ఒకగ్రామంలో పడిపోయాడు. దానికి కారకుడు ఆవూరి సర్పంచ్ భద్రయ్య అని తెలిసింది.పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు ఆరాత్రి సర్పంచ్‌ను మరికొంతమంది గ్రామస్థులను పిలిపించి ప్రశ్నించారు .మాసర్పంచ్ రిక్షాను తగలెట్టేసి ఊదేస్తాను అని సూరిబాబుపై గుర్రెత్తిపోవడం మాచెవులారా విన్నాం అని చెప్పారు. దాంతో సర్పంచ్‌ను ఆరాత్రి స్టేషన్‌లో ఉంచేశారు.

డాక్టర్లు ఒక రిపోర్టు ఇచ్చారు.అందులో "కుడిభుజంమీద గాయం వాపుదేలింది.పక్కటెముక ఒకటి విరిగింది. అక్కడ ఒక కవుకు దెబ్బ పడింది.అందువలన హైటెంపరేచర్ వచ్చింది సమయానికి తీసుకు రాబట్టి బ్రతికాడు. లేకుంటే చనిపోయేవాడు" అని ఉందా రిపోర్టు.

సర్పంచ్ ఏకారణంగా కొట్టాడు. అతడితో నిజం కక్కించాలి. ఒక రిక్షా వాడిని అకారణంగా చావగొట్టడం దురహంకారానికి నిదర్శనం అని కార్మిక సంఘం గంగవెర్రులెత్తింది. మీడియాలో ఆవార్త జిల్లానే కుదిపేసింది. పలువురు అయ్యయ్యో అని బాధపడ్డారు. కలెక్టర్ కూడా చూడడానికి హాస్పిటల్‌కు వచ్చి చికిత్స విషయంలో ఖర్చుకు వెనుకాడవద్దు అని చెప్పివెళ్లారు.

రెండు రోజుల తరువాత సూరిబాబు కళ్లు విప్పాడు. నీరసంతో ఏమి చెప్పలేకపోయాడు. పోలీసులు వచ్చి పలుప్రశ్నలు వేశారు. ఓపిగ్గా చెప్పు దామంటే కుదరలేదు. గొంతు పెగిలిరాలేదు. మరుసటిరోజు వాయిదా వేసుకుని వెళ్లిపోయారు. సెలైన్లు ఎక్కుతునే ఉన్నాయి. ఆసుపత్రిలో సూరిబాబుకు తోడు అతడి భార్య కొద్దిదూరంలో వరండాలో ఆదమరిచి నిద్రపోసాగింది.అప్పటికే ఆమెకు రెండురాత్రులుగా నిద్రలేదు.

పెట్రోలింగ్‌వాన్ వచ్చి ఆసుపత్రి ఆవరణలో ఆగింది. ఇద్దరు కానిస్టేబుల్సు దిగారు. వారి ముఖాలు భయాందోళనలో ఉన్నాయి. చెమటలు పోశాయి. మెల్లగా వార్డుల్లోకి వచ్చారు. అక్కడ ఎవరూ పట్టించుకోలేదు. నిత్యం పోలీసులు వచ్చిపోతుంటారు. ఇద్దరూ కలిసి సూరిబాబును సమీపించి చేత్తో తట్టారు. కళ్లు విప్పి చూశాడు. ఎదురుగా ఆరోజు తనని అకారణంగా రోడ్డుమీద లాఠీలతో కుళ్లబొడిచిన వాళ్లే అని స్ఫురణకు వచ్చింది. వారినిచూసి కళ్లు తిప్పుకున్నాడు.

"సూరిబాబూ మన్నించు! ఆరోజు పెద్ద ఆఫీసర్లు నైట్ డ్యూటీ సరిగ్గా చేయలేదని మామీద విరుచుకుపడితే మేము ఆ టెన్షన్‌లో నీమీదపడ్డాం. మేము కొట్టిన లాఠీదెబ్బలు ఇంత ప్రమాదానికి గురిచేస్తాయనుకోలేదు. రేపు డి.యస్.పి.ఎంక్వయిరీ చేస్తాడు. మాపేర్లు చెప్పకు. మాపిల్లాపాపలు అనాథలయిపోతారు. ఒకవైపు మీసంఘాలు మరోవైపు మీడియా నీకు ఈగతి పట్టించిందెవరు అని నిలదీస్తున్నాయి. కలెక్టర్ ఒకసారి నిన్ను చూసి వెళ్లారు. మరోవైపు సర్పంచ్ భార్య నాభర్త నిరపరాధి అంటూ తక్షణం విడుదల చేయమని పలువురు ఆడవాళ్లతో ఎమ్ఆర్ఓ కార్యాలయం వద్ద టెంటు వేసుకుని కూర్చుంది. మాకు కాళ్లుచేతులు ఆడడంలేదు." ఏడుపు ముఖాలు పెట్టి అర్థించారు. వరండాలో పడుకున్న సూరిబాబు భార్య ఎగాదిగా చూసి పరుగెత్తుకుని వచ్చి "ఏయ్ ఎవరుమీరు? పోలీసుల్లా ఉన్నారు.ఏమిటి గుసగుసగా మాట్లాడుతున్నారు" అర్థంకాక అడిగింది.

ఏమిచెప్పాలో అర్థంకాలేదు. తడబడ్డారు. "ఏమిటి ఆసర్పంచును కాపాడ్డానికి వచ్చారా? రేపు నాపెనిమిటి చెప్పకుండా ఉండాలి అని మంతనాలు చేస్తున్నారా? రేపు ఆరునూరైనా సర్పంచు చావగొట్టాడని చెప్పడం జరిగిపోద్ది. అందులో మరోమాటలేదు. నాపెనిమిటి నాపిల్లలు నిద్రాహారాలు లేకుండా ఏటిలోకొట్టుకు పోయినోళ్లలా అయిపోయాం. మాలాగే ఆసర్పంచు ఆడిపెళ్లాం, పిల్లలు మట్టికొట్టుకుపోవాలి.ఎంతేసి దెబ్బలు కొట్టాడు.ఆడిచేతులు తెగిపడిపోను" అని శివాలెత్తినదానిలా అరిచింది.అంతవరకు నిశ్శబ్దంగా ఉన్న ఆసుపత్రివార్డులో రోగులు కళ్లువిప్పారు.కొంతమంది లేచి కూర్చుని చెవులు రిక్కించారు. కానిస్టేబుల్సు గుండెలు గుబగుబలాడుతుంటే అక్కణ్నించి జారుకున్నారు. అప్పటికే రోగులు కొందరు పంచాయితీ పెట్టారు. తలా ఒక సలహా ఇచ్చారు. ఆమరుసటిరోజు పోలీసు అధికారి వచ్చాడు. వెనుక నైట్‌డ్యూటీ చేసిన కానిస్టేబుల్సు తోటకూర కాడల్లా వేలాడిపోయి బిక్కుబిక్కుమని ఉన్నారు.

"ఇక్కడ రిక్షా సూరిబాబు భార్య ఎవరు? సూరిబాబుకు ఎలా ఉంది?"

"తేరుకున్నాడు బాబూ! ఆసర్పంచు గండడు కుళ్లబొడిసీడంతో జ్వరం వచ్చిసీ ఇలా కాటికి కాళ్లు చాపినోడిలా అయిపోయినాడు."

"నువ్వు సర్పంచ్ సూరిబాబును కొట్టడం చూశావా?"

"నేను చూసినట్టైతే ఆడి కొట్టీసి ఎళ్లిపోగలడా?" కోపంతో ఊగింది.

"అర్ధరాత్రి వేళ డ్యూటీలోఉన్న మాకానిస్టేబుల్సు నీభర్తను సర్పంచ్ విషయంలో రాజీ కోరారా? లేక హెచ్చరించారా?"

"పోలీసోళ్లు రాజీకోరతారా?తంతాం పొడుస్తాం అని హెచ్చరిస్తారు గాని. అందుకే రాత్రిమీద పోనుకొట్టి కలక్టర్‌బాబుకి సెప్పాను."

వెనుకనే ఉన్న కానిస్టేబుల్సు ఇద్దరు భయభ్రాంతులైపోయి బెడ్‌మీద కూర్చున్న సూరిబాబుకు కళ్లతో సైగలు చేయసాగారు. మమ్మల్ని రక్షించు అనిమూగగా కోరారు. చెమటలతో తడిసిపోసాగారు.

"సూరిబాబు ఎలా ఉన్నావు? నేను అడిగినదానికి బదులీయగలవా? నిన్ను దారుణంగా కొట్టింది ఎవరు?"

"నాకు నీర్సం తగ్గింది. మీప్రశ్నలకు బదులీయగలను.నన్ను ఆసర్పంచ్ కొట్టలేదు. అతన్ని చాలాసార్లు నారిక్షాలో తీసుకువెళ్తుంటాను. అతడు మంచోడు. సరదాగా ఉంటాడు.అతడు తాగేసి ఎదుటివాడిని తాగుబోతు అంటుంటాడు. అలా ఆటపట్టిస్తుంటాడు."

"ఎందుకలా అబద్దాలు సెప్పేస్తున్నావు. ఆరాలుగాయి గండడు ఏటి ఇచ్చీడు" సూరిబాబు దగ్గరగా వెళ్లి ఎగాదిగాచూసింది భార్య.

"నువ్వు మధ్యలో రావద్దు. ఇది ఎంక్వయిరీ. పక్కకు వెళ్లు" ఆమెను గదమాయించాడు డి.యస్.పి. సూరిబాబు కానిస్టేబుల్సువైపు చూశాడు. అంతే వారిద్దరికి పైప్రాణాలు పైకి చేరుకున్నట్టయ్యింది.

"నిన్ను కొట్టింది సర్పంచ్ కానప్పుడు అంత పెద్ద గాయాలు ఎవరు చేశారు? భయపడకు. వారు ఎంతటివారైనా మేము చూసుకుంటాం"

ఒక కానిస్టేబుల్ ఎవరికి కన్పించకుండా చేతులు జోడించాడు. సూరిబాబు ఆరోజు రాత్రి ఏమిజరిగిందో వివరించాడు. అక్కడ ఉత్కంఠ నెలకొంది. అప్పటికి రిక్షా కార్మికసంఘ నాయకులు వచ్చి చేరారు.

"నేను ఎక్కువగా రాత్రుళ్లు రిక్షావేస్తుంటాను. రాత్రి వేళ రిక్షావాళ్ల మధ్య పోటీఉండదు. రెండింతలు వసూలు చేసుకోవచ్చు. అయితే ఆరాత్రి మీవెనుక ఉన్న పోలీసులు ఇద్దరు వచ్చారు. ఏరా! నీకు తెలియదా రాత్రుళ్లు రిక్షా నడపద్దంటే ఎందుకు నడుపుతున్నావు అని కోపంతో నా రిక్షా టైర్లు గాలితీసి హెచ్చరించి వెళ్లిపోయారు. ఆతరువాత ఇద్దరు అనామకులు వచ్చి రిక్షా కట్టమన్నారు. టైర్లలో గాలి పోలీసులు లాగేశారు అని చెప్పాను వారు కోపంతో నాతో వాదులాటకుదిగి చివరకి నాపై దాడిచేసి చేతిల్లో ఉన్న దుడ్డుకర్రలతో చావబాది రైల్వేస్టేషన్‌వైపు వెళ్లిపోయారు."

"వారు ఎవరైంది నీకు తెలుసా?చూపిస్తే గుర్తుపట్టగలవా?"

"వాళ్లను ఈజన్మలో మరిచిపోను.వారు పశువులకంటే హీనం. నావంటి వాడిపై దాడిచేయడం అమానుషం.నేను తలచుకుంటే వారిని ఏమైనా చేయగలను. వారిని పట్టుకోవడం నాకు పెద్దపనికాదు. కోర్టు బోనులో నిలపగలను.అలా చేస్తే నాకు ఏమిలాభం? నాఎడమచేయి చచ్చుపడింది.ఇకనేను రిక్షా లాగడానికి పనికిరాను. రోజూ రైల్వేస్టేషన్ రోడ్డులో చేయిచాచి అడుక్కోవడమే. అలాంటి హీనస్థితిలో నన్ను ఆ ఇద్దరు చూసి "అయ్యో మావలన ఇతడికి చేయి చచ్చుపడింది. చివరికి పొట్ట కోసం యాచనకు దిగాడా" అని ఏమాత్రం బాధపడినా నాకదే చాలు. వారిలో ఆమార్పు కోరుకుంటున్నాను. నాలా వేరెవ్వరిని కొట్టకుండా ఉంటారు.లేదు ఇంకా అదేదారిలో సాగితే ఏదో రోజు నాకుపట్టిన గతి వారికి పడుతుంది" కళ్లలో నీళ్లు తిప్పుకుంటూ చెప్పాడు.

దర్యాప్తు ముగిసింది. సూరిబాబును సుడులు తిరిగిన కన్నీటి పొరలతో చూశారు కానిస్టేబుల్సు. తర్వాత ఎవరికీ కన్పించకుండానే చేతులెత్తి దండం పెట్టారు వారు.

✻

హార్మోన్ల సమస్యలు... వచ్చే వ్యాధులు

డాక్టర్ కె. శ్రీకాంత్,
ఎండొక్రినాలజిస్ట్,
శ్రీకాంత్ ఎండొక్రినాలజి క్లినిక్,
గుంటూరు.



శరీరంలో వివిధ రకాల హార్మోనులు నిరంతరం పనిచేస్తూ జీవక్రియలను సక్రమంగా నిర్వహిస్తాయి. వీటిలో ముఖ్యమైనవి ఇన్సులిన్, థైరాయిడ్ హార్మోన్, సెక్స్‌హార్మోన్లు (టెస్టోస్టెరాన్, ఈస్ట్రోజన్). ఎడ్రినల్ స్టెరాయిడ్స్, గ్రోత్ హార్మోన్లు. శరీరంలో హార్మోన్ల ఉత్పత్తిలో గానీ, పనిచేసే విధానంలో గానీ హెచ్చుతగ్గుల వల్ల వివిధ రకాలు హార్మోను సమస్యలు వస్తాయి. వీటిలో ముఖ్యమైనవి మధుమేహం (డయాబెటిస్), థైరాయిడ్ సమస్యలు, అధికబరువు (ఒబెసిటి), ఎత్తుపెరుగుదల లోపాలు, నెలసరి ఇబ్బందులు, స్త్రీలలో అవాంఛిత రోమాలు, సంతానం కలుగకబోవుట, ఎముకల బలహీనత (ఆస్టియోపోరోసిస్) మొదలైనవి. ఎండోక్రైనాలజి (హార్మోన్ల) సమస్యలు, వాటి నుండి వచ్చే వ్యాధుల గురించి, తీసుకుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం....

సహజంగా మనం తీసుకునే ఆహారం ఒక విధంగా షుగర్‌గా మారుతుంది. దీనిని గ్లూకోజ్ అని కూడా అంటారు. షుగర్‌ను శరీరపు రక్తం ద్వారా కొన్ని మిలియన్ల జీవకణాలు గ్రహించి శక్తి కోసం వాడుకొనుటకు లేదా తదుపరి అవసరాల కోసం నిల్వచేస్తాయి. అయినప్పటికీ గ్లూకోజ్ ప్రవేశం జీవకణాలలో ఉన్న ఇన్సులిన్‌తో మాత్రమే సాధ్యమవుతుంది. ప్యాంక్రియాస్ అనే చిన్న గ్రంథి ద్వారా ఇన్సులిన్ అనే హార్మోను ఉత్పత్తి అవుతుంది. ఇది ఉదరపు వెనుక భాగాన ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారిలో, ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గిపోయి లేదా ఇన్సులిన్ ప్రభావచర్య క్షీణించిపోయి గ్లూకోజ్ జీవకణాల లోపలికి ప్రవేశించు సామర్థ్యం లేక రక్తంలోనే ఉండి పోతాయి. అలా రక్తంలో గ్లూకోజ్ శాతం నిదానంగా పెరుగుతుంది. ఈ స్థితిని హైపర్‌గ్లైసిమియా అంటారు. ఇది షుగరువ్యాధికి దారితీస్తుంది.

మధుమేహంలో టైప్1, టైప్ 2, జస్టేషనల్ డయాబెటిస్ (గర్భావస్థ సమయంలో వచ్చే డయాబెటిస్), సెకండరీ డయాబెటిస్ అని నాలుగు రకాలు ఉన్నాయి. ఎక్కువ మందిలో టైప్ 2 డయాబెటిస్ వ్యాధి వస్తుంది. తరచుగా చూసే టైప్2 డయాబెటిస్‌ను ఆహార నియమాలతో, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో, మందులతో అదుపులో ఉంచుకోవచ్చు. రక్తంలో గ్లూకోజ్‌శాతం బాగా ఉంటే వీరికి ఇన్సులిన్ అవసరం ఏర్పడుతుంది. టైప్ 1 డయాబెటిస్ చిన్నపిల్లలో ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి వచ్చినవారు జీవితాంతం ఇన్సులిన్ తీసుకోవాల్సి ఉంటుంది.

డయాబెటిస్ వ్యాధి లక్షణాలు

హైపర్ గ్లైసిమియా

రక్తరిలో గ్లూకోజ్ శాతం అధికంగా ఉంటే దానిని హైపర్ గ్లైసిమియా అంటారు. హైపర్‌గ్లైసిమియా ప్రాథమిక దశలో చాలా సంవత్సరాల నుండి ఉన్నా ఎటువంటి లక్షణాలు కలుగజేయదు. కానీ శరీరంలోని అవయాలపై ప్రభావం చూపుతుంది. బ్లడ్‌షుగర్ శాతం చాలా అధికంగా ఉన్నపుడు అది వివిధ లక్షణాలకు దారితీస్తుంది. అతి మూత్రం, ఎక్కువ దాహం, ఎక్కువ ఆకలి, బలహీనత, బరువుతగ్గడం, చూపు మందగించడం, తిమ్మిరిగా ఉండటం, ఎప్పుడూ అంటురోగాలకు గురికావడం వంటి వాటికి గురిచేస్తుంది. తగిన రీతిలో డయాబెటిస్‌ను నియంత్రించకపోతే వివిధ ఇబ్బందులకు దారితీసుంది.

ప్రాథమిక దశలోనే కనుగొనడం

గ్లూకోజ్ టాలరెన్స్‌టెస్ట్ (GTT) ద్వారా డయాబెటిస్‌ను ప్రాథమిక దశలోనే కనుగొనే వీలుంది. నూతన అధ్యయనం ప్రకారం గ్లూకోజ్ టాలరెన్స్‌టెస్ట్ చేయడం ద్వారా ప్రీ డయాబెటిస్ అనే సమస్యను కొన్ని సంవత్సరాల ముందే కనుగొనే వీలుంది. ప్రీ డయాబెటిస్ సమస్య ఉన్నవారికి భవిష్యత్‌లో షుగరు వ్యాధి రావచ్చు. ప్రీ డయాబెటిస్ ఉన్న వారు జీవన శైలిలో మార్పులు తీసుకురావడం వల్ల (ఆహార నియమాలు, వ్యాయామం సక్రమంగా పాటించడం) డయాబెటిస్‌ను రాకుండా నివారించే వీలుంది. భవిష్యత్‌లో కొన్ని మందుల ద్వారా ప్రీ డయాబెటిస్ ఉన్న వారికి షుగరువ్యాధి రాకుండా నివారించే వీలుంది. అధికబరువు, శ్రమలేని పని, వ్యాయామం చేయని వారు, మానసిక ఇబ్బందులకు గురయ్యేవారు, 45 సంవత్సరాలు దాటిన వారు, కుటుంబంలో ఎవరికైనా డయాబెటిస్ ఉన్నా వారు గ్లూకోజ్ టాలరెన్స్‌టెస్ట్ చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

మధుమేహంతో వచ్చే సమస్యలు

హైపోగ్లైసిమియా (రక్తంలో తక్కువైన షుగర్), డయాబెటిక్ కెటొయసిడోసిస్ (మూత్రంలో కీటోన్స్ వెలువడటం - కీటోనులు వ్యర్థమైన ఉత్పాదకాలు, ఇవి దేహంలో శక్తి కోసం గ్లూకోజ్‌కు బదులుగా కొవ్వు కరగడం వల్ల ఉత్పత్తి అవుతుంది.)

దీర్ఘకాలంగా ఎదురయ్యే ఇబ్బందులు

చూపు మందగించడం (డయాబెటిక్ రెటినోపతి), మూత్రపిండాల సమస్యలు(డయాబెటిక్ నెఫ్రోపతి), నరములు దెబ్బతినడం (డయాబెటిక్ న్యూరోపతి), పాదాల సమస్యలు (డయాబెటిక్ ఫుట్), గుండె, రక్తనాళాలలో కొవ్వు అధికంగా ఉడటం వల్ల గుండెపోటు, సెరిబ్రల్ స్ట్రోక్, హై బ్లడ్‌ప్రెషర్, చర్మవ్యాధులు ఫలితంగా తరుచూ అంటురోగాలు, పొక్కులు, ఎగ్జిమా మొదలైనవి వస్తాయి.

షుగరు వ్యాధిగ్రస్తులు తరచూ చేయించుకోవాల్సిన పరీక్షలు

ఫాస్టింగ్ (పరగడుపున) బ్లడ్‌షుగర్, పోస్ట్‌ప్రాండియల్ (భోజనం తర్వాత) బ్లడ్‌షుగర్ పరీక్ష తరచుగా చేయించుకోవడం వల్ల షుగరు వ్యాధి అదుపులో ఉందో లేదో నిర్ధారించుకొనే వీలుంది. సాధ్యమైనంతవరకూ ల్యాబొరేటరీలో ఆటోమెటెడ్ మిషన్లపై షుగరు పరీక్ష చేయించుకోవడం మంచిది. తరచుగా షుగరు పరీక్షలు చేయించుకునే వారు గ్లూకోమీటర్ పరికరంతో ఇంటివద్దనే పరీక్ష చేసుకునే వీలుంది. లిపిడ్ ప్రొఫైల్ (రక్తంలోని కొలెస్ట్రాల్, ట్రైగ్లిసరైడ్ మొదలైనవి), గ్లైకోస్లేటెడ్ హిమోగ్లోబిన్ (హెచ్‌బిఎ1సి), యూరిన్ మైక్రోఆల్బుమిన్ పరీక్షలు వైద్య సలహా మేరకు చేయించుకోవాలి.

(మరిన్ని వివరాలు పైవారం)

*


ఏమండోయ్.. మీరు పొరపాటున చంటిగాడి దీపావళి తుపాకి తీసుకెళ్లారు... నక్సలైట్ ఏరియా జాగ్రత్త...!!
V. Rama Krishna


టపాసుల దుకాణం
దీపావళి ప్రత్యేక టపాసులు
రాయలసీమ బాంబులు
కోస్తా బాంబులు
తెలంగాణా బాంబులు
అమ్మబడును
రిమోట్ బాంబ్స్ మా ప్రత్యేకం
V. Rama Krishna


దీపావళికి మందు సామాన్లు తెచ్చుకుంటా అంటే ఇవా...!!
V. Rama Krishna


డిస్కౌంట్‌లో టపాసులు కొనద్దంటే విన్నారా...!!
తుస్
Bomb
75% డిస్కౌంట్ బాంబ్స్
వి.రామకృష్ణ


చంద్రమండలంలో మొదటి బాంబు కాల్చిన వ్యక్తిగా తన పేరు నిలవాలని ఇలా...!!
V. Rama Krishna


దీపావళి టపాసులు కాదు సర్...! మొన్న సిటీలో టెర్రరిస్టులు పెట్టినవి మనోళ్లు ఏరుకొస్తున్నారు...!!
పోలీస్ స్టేషన్
ఉద్దంటి


మనం కొనే... వెయ్యి రూపాయల టపాసుల కోసం అంత పెద్ద సంచి ఎందుకురా..? ఎంచక్కా మన జేబులు వుండగా..?
ఉద్దంటి


అనవసరంగా తెప్పించాం సార్... దీనికి శివకాశి బాంబుల్ని మాత్రమే పేలకుండా ఆపగలదట సార్...!!
బాంబ్ డిటెక్టర్
ఉద్దంటి

నాలుగు రోజులుకూడా ఆగలేను

శ్వేత బసు ప్రసాద్... పుట్టింది జమ్‌షెడ్‌పూర్‌లో. పెరిగింది ముంబాయి. బాల నటిగా జాతీయ అవార్డు అందుకుంది. 'కొత్తబంగారులోకం'తో హీరోయిన్‌గా వెండి తెరకు పరిచయమైంది. ఇందులో 'ఎ క డ' (ఎక్కడ) అంటూ సాగదీసి ముద్దుగా బొద్దుగా పలికి... 'అయ్యబాబోయ్ నువ్వలా అనకు. నాకు ఏదోలా ఉంది' అంటూ కుర్రకారు గుండెల్లో అలజడి సృష్టించిన శ్వేత బసు ప్రసాద్ చెప్పిన ముచ్చట్లు...

మీ బయోడేటా....

నా పూర్తి పేరు శ్వేత బసు ప్రసాద్. 'స్టీల్ సిటీ'లో పుట్టాను. అదేనండి... జమ్‌షడ్‌పూర్. మూడేళ్ళ వయసులో ముంబాయి వచ్చేశాం. అమ్మ బెంగాలీ. నాన్నది ఉత్తర ప్రదేశ్. 11వ ఏట 'మక్డి' అనే హిందీ చిత్రం ద్వారా బాల నటిగా పరిచయమయ్యాను. అందులో ద్విపాత్రాభినయం చేశాను. నటనకుగాను జాతీయ ఉత్తమ బాలనటి అవార్డును అప్పటి రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి చేతులు మీదుగా అందుకున్నాను. విశాల్ భరద్వాజ్ ఈ చిత్రానికి దర్శకుడు. షబానా అజ్మీ లీడింగ్ రోల్. 14 ఏళ్ళ వయసులో నగేష్ కుకునూర్ దర్శకత్వంలో సుభాష్ ఘూయ్ నిర్మించిన 'ఇక్బాల్' చిత్రంలో నటించాను. ఆ తర్వాత మిథున్ చక్రవర్తి నటించిన బెంగాలీ చిత్రంలో యాక్ట్ చేశా. హీరోయిన్‌గా తొలిసారి నటించిన చిత్రం 'కొత్తబంగారులోకం'. వచ్చే జనవరికి 18వ ఏట అడుగుపెడతాను.

మీరు ప్రముఖ దర్శకులు, నిర్మాతల చిత్రాల్లో నటించారు కదా! నటనలో ఏయే విషయాలు నేర్చుకున్నారు?

నటనలో ఎలాంటి తర్ఫీదూ పొందలేదు. సహజంగా అందరిలాగే సినిమాలంటే ఇష్టపడేదాన్ని. 'మక్డి' చిత్రంలో నటిస్తున్నప్పుడు నేర్చుకోవాలన్న ఆలోచనే ఉండేది కాదు. కాకపోతే... షబానా అజ్మీ నటిస్తున్న సన్నివేశాలు చూసి నేర్చుకోవాలన్న తపన పుట్టింది. ఆ తర్వాత సన్నివేశాలకు అనుగుణంగా బాడీ లాంగ్వేజ్ టూన్ చేశాను. మిధున్ చక్రవర్తి అంకుల్‌ను చూసి క్యారెక్టర్‌లో ఎలా ఇమిడిపోవాలో తెలుసుకున్నాను. 'కొత్తబంగారులోకం'లో జయసుధ, బ్రహ్మానందం వంటి సీనియర్ ఆర్టిస్టులతో యాక్ట్ చేయడంతో నా నటనలో ప్లస్, మైనస్ పాయింట్స్ తెలుసుకున్నాను.

మీలో ప్లస్ పాయింట్...

నాకు జ్ఞాపకశక్తి ఎక్కువ. అదే నా బలం. 10 నిముషాల్లో సీన్ తీస్తారనగా డైలాగ్స్ చెప్పేవారు. సీన్‌లోకి వెళ్ళగానే తడుముకోకుండా చెప్పేదాన్ని. చేస్తున్న పనిని అంకితభావంతో చేయడమే... జ్ఞాపకశక్తికి కారణం. నటించేటప్పుడు చురుకుగా ఉంటాను. ఎంజాయ్ చేస్తూ నటిస్తాను.

నటన సరే... మరి చదువు...

నటనతో పాటు చదువు కూడా ముఖ్యమైందే. చదువుకోకపోతే మా పేరెంట్స్ ఒప్పుకోరు. చదువుకుంటేనే నేనంటే వాళ్ళకు ముద్దు. ప్రస్తుతం ముంబయిలోని సి.బి.యస్.ఇ హైస్కూల్లో లెవెన్త్ చదువుతున్నాను. బి.కాం చదువుదామనుకుంటున్నాను.

'కొత్తబంగారులోకం' అనుభవాలు...

ప్రేమ కథలు చాలా చూశాం. కానీ 'కొత్తబంగారులోకం' స్క్రిప్ట్ ఫ్రెష్‌గా ఉంటుంది. మిక్కీ జె. మేయర్ సంగీతం, చోటా కె. నాయుడు ఫొటోగ్రఫీ అద్భుతం. 'కొత్తబంగారులోకం'లో నటించడం కొత్త ఎక్స్‌పీరియన్స్‌ను మిగిల్చింది. నేను ముంబాయి అమ్మాయిని కావడంతో ఇక్కడి కల్చర్ డిఫరెంట్ అనిపించింది. ఇక్కడి భాష, సంస్కృతి ఇబ్బంది అనిపించినా.. వీటిని ఎంజాయ్ చేశాను.

బాల నటిగా జాతీయ అవార్డు అందుకున్నారు కదా! మరి మీ తర్వాతి అచీవ్‌మెంట్ ఏంటి?

ఉత్తమ సహాయ నటిగా కరాచీ ఫిలిం ఫెస్టివల్లో ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నాను. నేను హిందూ అమ్మాయినైనా... 'ఇక్బాల్' చిత్రంలో ముస్లిం అమ్మాయిగా నటించాను. బెంగాలీ చిత్రంలో తల్లిలేని అమ్మాయిగా నటించాను. నిజ జీవితానికి విరుద్ధమైన 'స్వప్న' క్యారెక్టర్‌ను 'కొత్తబంగారులోకం'లో పోషించాను. చిన్న వయసులోనే విభిన్న పాత్రల్లో నటించే అవకాశం లభించింది. భవిష్యత్‌లో మరిన్ని కష్టమైన పాత్రలను ఛాలెంజ్‌గా తీసుకుని నటించి మెప్పించగలను.

'కొత్తబంగారులోకం'లో స్వప్నకూ, నిజ జీవితంలో స్వప్న (శ్వేత)కు తేడా...

కొన్ని నియమ నిబంధనల నడుమ స్వప్న పెరుగుతుంది. అలాగే ఆమె తల్లి దండ్రులు సంకుచిత భావాలతో నిండిపోయారు. పిల్లల పెంపకంలో మితిమీరిన జాగ్రత్త ప్రదర్శించారు. ఇక నా నిజ జీవితం గురించి చెప్పాలంటే... స్వేచ్ఛకు కొదవ లేదు. అమ్మే నా బెస్ట్ ఫ్రెండ్. ప్రతి విషయాన్నీ అమ్మతోనే పంచుకుంటా. సింపుల్‌గా ఉంటా. డిఫరెంట్‌గా ఆలోచిస్తా. ఫ్రెండ్స్‌తో సరదాగా, తుంటరిగా గడుపుతుంటా. స్వప్న తన ప్రేమ ఫలించడానికి నాలుగు సంవత్సరాలు వేచివుంది. కానీ నేను మాత్రం నాలుగు రోజులు కూడా వేచి ఉండలేను (నవ్వుతూ).

అభిమాన నటుడు...

అమీర్ ఖాన్. ఆయన చిత్రాలు విలువలతో కూడుకుని ఉంటాయి. కొన్న టిక్కెట్టుకు ఉపయోగం ఉంటుంది.

క్లాసిక్ చిత్రాలను రీమేక్ చేయదలిస్తే.. ఏయే సినిమాల్లో నటించడానికి ఒప్పుకుంటారు?

అమర్ ప్రేమ్ (షర్మిలా ఠాగూర్), దుష్మన్ (కాజోల్), 'ఖూబ్‌సూరత్ (రేఖ).

అభిరుచులు...

పుస్తకాలు, న్యూస్ పేపర్స్ చదవడం. మ్యూజిక్ అంటే ఇష్టం. ఐపాడ్ ఎప్పుడూ నాతోనే ఉంటుంది.

ఎక్కువగా ఇష్టపడే వంటకాలు..

అమ్మ బెంగాలీ కావడంతో... రెగ్యులర్ డైట్‌గా చేప, రైస్ తింటాను. నాన్నను తృప్తి పరచడానికి 'రాజ్మా చావల్' తింటాను. అలాగే బట్టర్ చికెన్ కూడా. చైనీస్ ఫుడ్, రోడ్డు పక్కన అమ్మే పానీ పూరి, పావ్ బాజి, వడ పావ్... తింటాను.

ఇన్ని తింటే లావై పోతారు కదా!

తిండితో పాటు ఎక్సర్‌సైజ్‌ను కూడా నమ్ముతాను. నేను తిండిబోతునైనా పర్టిక్యులర్ టైమ్‌లో మాత్రమే తింటాను. అలాగే రెగ్యులర్‌గా ఎక్సర్‌సైజ్ చేస్తాను.

17 ఏళ్ళ వయసులోనే హావభావాలు బాగా పలికిస్తున్నారే!

మీ కాంప్లిమెంట్‌కు ముందుగా థ్యాంక్స్ (నవ్వుతూ). చిన్నప్పటి నుంచీ నటించడంతో హావభావాలు బాగా పలికించగలుగుతున్నానేమో.

నటి కాకపోతే..

విషయాన్ని వాదించడంలో మంచి నేర్పుంది. నటి కాకపోతే లాయర్ అయ్యేదాన్నేమో!

*



తొక్కుడు లడ్డు

కావలసినవి

శెనగపిండి - 1కప్పు, పంచదార - 1 1/4 కప్పులు

ఏలకులు -5, నెయ్యి - 2 టీ స్పూన్లు, నూనె - తగినంత

శెనగ పిండిలో నీళ్లు కలిపి జంతికల పిండిలా తయారు చేసుకోవాలి. మూకుడులో నూనె పోసి కాగిన తర్వాత సన్నని సెగమీద జంతికలు వేయించాలి. జంతికలు చల్లారిన తర్వాత మిక్సీలో వేసి మెత్తని పొడిలా గ్రైండ్ చేసుకొని పెట్టుకోవాలి(జంతికలతో పాటు ఏలకులు కూడా వేసి గ్రైండ్ చేసుకోవచ్చు). 1 1/4 కప్పు పంచదారకు 1/2 కప్పు నీళ్లు కలిపి తీగ పాకం వచ్చే వరకు స్టౌ మీద ఉంచి గరిటతో కలుపుతూ ఉండాలి. తర్వాత గ్రైండ్‌చేసిన జంతికల పొడిని పాకంలో వేసి ఉండలు లేకుండా కలిపి స్టౌపై నుండి దించుకోవాలి. చేతికి నెయ్యిని రాసుకోవాలి. చల్లారిన తర్వాత మెత్తగా ఉన్న ఈ ముద్దను చిన్న చిన్న లడ్డూల్లా చేసుకోవాలి. అయితే బాగా ఆరిన తర్వాత మాత్రమే వీటిని డబ్బాల్లో పెట్టుకోవాలి. ఇవి వారం రోజులు నిల్వ ఉంటాయి. మెత్తగా, రుచిగా ఉండడం వల్ల వీటిని పిల్లలూ, పెద్దవాళ్లూ ఇష్టపడతారు.

మలయ్ వడ

కావలసినవి

పాల విరుగుడు - 2 కప్పులు

మైదా లేక బియ్యం పిండి - అరకప్పు

పచ్చిమిర్చి -5

కొత్తిమీర - 1కట్ట

జీలకర్ర - 1టీ స్పూన్

నూనె - వేయించటానికి సరిపడా

విరిగిన పాలను ఈ విధంగా ఉపయోగించుకోవచ్చు. లేదా ఈ వడలు చేయాలనుకున్నప్పుడు పాలు విరగ్గొట్టొచ్చు. విరిగిన పాలను తోడుపెట్టాలి. పెరుగు కొద్దిగా పులిశాక దానిని పలుచని బట్టలోకి వేసి నీరంతా పోయేలా చేయాలి. అయితే పిండకూడదు. నీరు దానికదే పోవాలి. మిగిలిన పెరుగు గడ్డని సన్నగా తరిగి ఉంచుకున్న పచ్చిమిరప కాయలు, కొత్తిమీర, ఉప్పు, జీలకర్ర, బియ్యంపిండి వేసి మొత్తం ముద్దలా చేసుకోవాలి. దీనిని ఆకుమీద చిన్న చిన్న వడల్లాచేసి దోరగా వేయించుకోవాలి. వేడివేడిగా తింటే చాలా బావుంటాయి. అయితే ఇవి నూనె ఎక్కువగా పీల్చుకుంటాయి.





కోకోనట్ కుకీస్

కావలసినవి

వెన్న - 1కప్పు

పంచదార పొడి - 1/4 కప్పు

మైదా - 1కప్పు

కొబ్బరి తురుము - 1/2 కప్పు

బేకింగ్ పౌడర్ - 1/2 టేబుల్ స్పూన్

ముందుగా ఒక డిష్‌లో వెన్న, పంచదార పొడిని వేసి బాగా కలుపుకోవాలి. వేరే పాత్రలో మైదా (కొబ్బరి పొడి 1టీస్పూన్ వేరుగా ప్లేట్‌లో వేసి ఉంచాలి), మిగతా కొబ్బరి పొడిని వెన్న, పంచదార మిశ్రమంలో కలపాలి. దాంతో పాటు బేకింగ్ పౌడర్ కూడా వేసి ఆ పిండిని ముద్దలా కలిపి ఒక అరగంట నానపెట్టాలి (ఫ్రిజ్‌లో కూడా పెట్టుకోవచ్చు). తర్వాత ఈ పిండిని బాగా కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసుకుని ముందుగా తీసి పెట్టుకున్న కొబ్బరి పొడిలో అద్దాలి. బేకింగ్ ట్రేకు నెయ్యి రాసి ఆ ఉండలను ట్రేలో పెట్టి ఓవెన్‌లో 15 నిమిషాలు బేక్ చేయాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి. పైగా చాలా రోజులు నిల్వ ఉంటాయి.

ఆలూ బోండా

కావలసినవి

బంగాళ దుంపలు - పావు కిలో, పచ్చిమిర్చి - 6 , ఉల్లిపాయలు - 2

అల్లం - చిన్నముక్క, శెనగపిండి - పావు కిలో, ఉప్పు - సరిపడా,

కారం - 1/2 స్పూను, కొత్తిమీర - 1 కట్ట, కరివేపాకు - రెండు రెబ్బలు

తినే సోడా - చిటికెడు, నూనె - పావుకేజీ

బంగాళ దుంపలను ఉడకపెట్టి పొట్టు తీసి మెత్తగా చేసి ఉంచుకోవాలి. శెనగపిండిని జల్లించి అందులో ఉప్పు, కారం, సోడా ఉప్పు కలిపి బజ్జీల పిండిలా జారుగా కలుపుకోవాలి. స్టౌమీద గిన్నె పెట్టి కొంచెం నూనెపోసి కాగాక సన్నగా తరిగి ఉంచుకున్న ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కొత్తిమీర వేసి దోరగా వేయించుకోవాలి. తర్వాత చిన్నగా తరిగి ఉంచుకున్న అల్లంముక్కలను, మెత్తగా చేసుకున్న బంగాళదుంప ముద్దను కూడా అందులో వేసి వేయించుకొని ఉంచుకోవాలి. ఈ కూర చల్లారిన తర్వాత చిన్న ఉండలుగా చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు బాండీలో నూనె పోసి బాగా కాగాక కూరతో చేసిన ఉండలను ముందుగా కలిపి ఉంచుకున్న బజ్జీల పిండిలో ముంచి నూనెలో దోరగా వేయించుకుంటే ఆలూ బోండా రెడీ. వీటిని ఏ చట్నీతో లేదా సాస్‌తో తిన్నా చాలా బావుంటాయి.

*

బొమ్మ గీస్తారా!

బుజ్జాయిలూ... పాప బొమ్మ చాలా బావుంది కదూ. కానీ సగమే ఉంది. దీన్ని చూసి మిగతా సగాన్ని వేసి పాపాయిని పూర్తి చేద్దాం.



p	a	l	a	c	e	w	t
h	h	a	o	q	b	f	e
u	e	m	a	g	i	c	e
n	s	p	t	v	c	s	t
g	e	n	i	e	a	e	h
r	o	u	l	s	v	a	o
p	r	i	n	c	e	s	s
k	t	h	n	l	m	s	q

palace magic
genie princess
lamp teeth
sea

కనిపెట్టేస్తే పోలా...

పిల్లలూ... మీకు ఇక్కడున్న బాక్సులో చాలా అక్షరాలు కనిపిస్తున్నాయి కదూ. దాని కింద కొన్ని పదాలు ఇస్తున్నాం. మీరు వాటిని ఆబాక్సులో ఎక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టండే. అయితే అవి నిలువుగా, అడ్డంగా ఎలాగైనా ఉండొచ్చు.

జత చేస్తే!

పిల్లలూ! ఇంగ్లీష్‌లో కొన్ని పదాలు వినటానికి ఒకేలా ఉన్నా వాటి అర్థాలు వేరుగా ఉంటాయి. అటువంటి పదాలు కొన్ని ఇక్కడ ఉన్నాయి. మరి అవేంటో చూసి జత చేయండే.



జవాబు: hair-hare, one-won, write-right, I-eye.

5	+	6	=	11
+		−		+
10	−	3	=	7
=		=		=
15	+	3	=	18

చకచకా పూరించాలి

మీకు కూడికలూ, తీసివేతలు అన్నీ బాగా వస్తాయి కదూ. మీకోసం చాలాచిన్న చిన్న లెక్కలు ఇక్కడ సిద్ధంగా ఉన్నాయర్రా. మరి త్వరగా చేసేయండి.

జవాబు: 5+6=11, 5+10=15, 6-3=3, 10-3=7, 11+7=18, 15+3=18.

బాలనేస్తాలు

చుక్కలు కలిపేద్దాం





ఎలా పెడ్తే బొమ్మ వస్తుంది?

ఫ్రెండ్స్! ఈ అబ్బాయి బొమ్మను ఎవరో ముక్కలు ముక్కలుగా చించేశారు. దాంతో అవి గజిబిజి గందరగోళంగా పడున్నాయి. మనమే కరెక్టుగా పెట్టేసి చక్కని బొమ్మ చేసేద్దామా.

జవాబు : 3,4,1,5,2

దారి చెప్తారా!

కిందున్న పాముని గమనించారా! గుటకలు మింగుతూ చూస్తోంది కదూ!! దానికి పైన కప్ప కనిపించేసరికి ఆకలి గుర్తొచ్చేసి ఎప్పుడెళ్లి ఆ కప్పని తిందామా అని చూస్తోంది. కానీ ఎదురుగా ఉన్న గజిబిజి దారులన్నీ చూస్తుంటే తికమకగా ఉంది. పాముకి దారి చెప్పి సాయం చేద్దామా. 'పాపం కప్ప అనుకుంటున్నారా'! మీరు నిరభ్యంతరంగా పాముకు దారి చెప్పొచ్చు. ఎందుకంటే ఇవి రెండూ బొమ్మలే కదా.



S	T	K	M	G
D	X	Q	U	O
B	L	N	X	D
K	O	G	I	S
N	Q	B	M	P

ఏ పువ్వు?

ఇక్కడున్న బాక్సులో కొన్ని ఇంగ్లీష్ అక్షరాలు ఉన్నాయి కదా. అయితే వాటిలో కొన్ని అక్షరాలు రెండుసార్లు ఉన్నాయి. వాటన్నింటినీ ఒక్కొక్కటిగా కొట్టివేస్తూ పోతే చివరకి ఐదు అక్షరాలు మిగులుతాయి. వాటిని ఒక క్రమంలో రాస్తే ఓ పువ్వు పేరొస్తుంది.. అదేంటో మీరు రాయాలి. మరి మొదలెడ్తున్నారా.

జవాబు : tulip

వెలుగుల పండుగ

అట్టమీది కథ

-పీపీ

దీపం, వెలుగు ఇవి రెండూ ఎప్పుడూ ఉత్తేజ కారకాలే. అలాంటి దీపాలు ఒకటి రెండు కాక లక్షల సంఖ్యలో ఇంటింటి ముందూ కనిపించే దీపావళి పండుగకు అందుకే ప్రత్యేకత. విశ్వాసాలతో నిమిత్తం లేకుండా ఉల్లాసంగా పాల్గొనే అవకాశం వున్న పండుగ ఇదే. జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు టపాకాయలు కాల్చని వారు వుండొచ్చునేమో గాని చిచ్చుబుడ్డి అందాలకు ఆనందించని వారు, ఆకాశంలో వెలుగులు విరజిమ్మే తారజువ్వల తళతళలను ఆస్వాదించని వారు వుండరు.

పండుగలు ఎన్ని వున్నా దీపావళి కథే వేరు. అంత ప్రకాశవంతమైన పండుగ మరొకటి లేదు. మరీ ముఖ్యంగా పిల్లపిడుగులకు దీపావళి అంటే ఎంత ప్రేమంటే దానికోసం చాలా రోజుల ముందు నుంచీ ఎదురు చూస్తుంటారు. గత సారి కొనని టపాసులు ఈ సారి తప్పక తెచ్చుకోవాలని ప్లాన్లు వేసుకుంటారు. తీరా పండుగ దగ్గర కొచ్చేసరికి నాన్న తీసుకెళ్లడాన్ని వాయిదా వేస్తుంటే వాళ్లలో టెన్షన్ పెరిగిపోతుంటుంది. పక్కిళ్ల వాళ్లు తెచ్చుకుని ఎంచక్కా ఆరబెట్టేసుకుంటుంటే మనం వెనకబడి పోతున్నామని యమా ఇదై పోతారు. అయినా పట్టించుకుంటేనా? నాన్నకు తీరు బాటు కుదిరి టపాసుల కోసం వెళ్లేసరికి పండుగ వచ్చేసి వుంటుంది. అప్పుడు అక్కడ జనం కిక్కిరిసి వుంటారు, మందుగుండు సామాను అడుగంటి వుంటుంది. ఏవో వున్నవి తీసుకుని వెళ్లకపోతే అసలే నిండుకుంటాయని బెదిరిస్తారు షాపుల వాళ్లు. చేసేదేముంది?మళ్లీ కాళ్లీడ్చుకుంటూ దక్కినవే గొప్పకనక వాటితోనే దీపావళి అదిరిపోతుంది. ఎవరు ఏం కాల్చినా ఆ రోజున వీధులన్నీ ధగధ్ధతలతో వెలిగి పోతాయి. చెవులు పగలగొట్టే శబ్దాలు, కనువిందు చేసే కాంతులు, దూసుకుపోయే ఆకాశ టపాసులు, గిర్రున తిరిగే భూ చక్రాలు, విష్ణు చక్రాలు, అన్ని కలిసి కాంతి వర్షం కురుస్తుంది. కళ్లు మిరుమిట్లు గొల్పుతుంది.

ఇటీవలి కాలంలో చాలా మంది పెద్దల సలహా వల్లనూ పిల్లలు తమకు తాము గాను టపాసులపై మితిమీరిన ఖర్చు ఎందుకుని ఆలోచిస్తున్నారు. అయినా సరే సంతోషాన్ని వ్యక్తీకరించే ఈ పండుగ శోభ పెద్దగా తగ్గడం లేదు. ఎందుకంటే ఏదో ఒక పేరుతో ప్రపంచంలోని అన్నిదేశాలలోనూ దీపాల పండుగలు జరుపుకోవడం కద్దు.

గోరంత దీపం కొండంత వెలుగు
చిగురంత ఆశ జగమంత వెలుగు

ఆరుద్ర కలం నుంచి వెలువడిన ఈ చరణాల్లోని అర్థాన్ని మరింత గంభీరంగా ఉపనిషత్తుల్లో తమసోమా జ్యోతిర్గమయ అన్నారు: చీకటిలోంచి వెలుగులోకి నడిపించు అని అర్థం. దీపం, వెలుగు ఇవి రెండూ ఎప్పుడూ ఉత్తేజ కారకాలే. అలాంటి దీపాలు ఒకటి రెండు కాక లక్షల సంఖ్యలో ఇంటింటి ముందూ కనిపించే దీపావళి పండుగకు అందుకే ప్రత్యేకత. విశ్వాసాలతో నిమిత్తం లేకుండా ఉల్లాసంగా పాల్గొనే అవకాశం వున్న పండుగ ఇదే. జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు టపాకాయలు కాల్చని వారు వుండొచ్చునేమో గాని చిచ్చుబుడ్డి అందాలకు ఆనందించని వారు, ఆకాశంలో వెలుగులు విరజిమ్మే తారజువ్వల తళతళలను ఆస్వాదించని వారు వుండరు.

చీకటి వెలుగుల రంగేళి

జీవితమే ఒక దీపావళి అన్నాడు ఆత్రేయ. వెలుగు చీకట్ల సమ్మేళనంలా కష్టసుఖాల కలబోత దీపావళి. అయితే టపాసులు కాల్చుకోవడం ఖరీదైన పనే గనక **"వచ్చింది దీపావళి పండుగ వున్నోళ్ల దబ్బంత దండగ'** అన్నాడు మరో కవి. లేనోళ్లు ఎలాగూ చేసుకోలేరన్న ధ్వనితో పాటు వున్నవాళ్లయినా సరే పూరికే దండగ చేస్తున్నారని ఆయన భావన.

అవసరం అనవసరం మాట అటుంచితే దీపాలు వెలిగించడం, టపాసులు, తారాజువ్వలు కాల్చుకోవడం ఎప్పుడైనా సంతోషానికి సంకేతం. వివాహాది వేడుకలు, విజయాలు, ప్రారంభోత్సవాలు వగైరా సందర్భాలలో పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తుంటారు. ఇటీవల రాజకీయ నేతల సత్తా చాటడానికి నిరాఘాటంగా భారీ శబ్దాలతో ఔట్లు పేల్చడం పెద్ద ఫ్యాషన్‌గా మారిపోయింది. అయితే ఇలా ఎవరి వేడుకలకు వారు కాల్చుకోవడం కాక అందరూ ఒకసారి వెలుగుల పండుగలా జరుపుకునేది దీపావళి మాత్రమే. విద్యుద్దీపాలు రాకముందు, మనుషులు చీకటి పడితే చంద్రకాంతిపై మాత్రమే ఆధారపడుతున్న దశలో దీపాల వరుసలు పేర్చడం ఎంత శోభాయమానంగా వుంటుందో వూహించుకోవలసిందే.

విశ్వాసాలు

అందాల కాంతులతో పాటు దీపావళి పండుగ అనేక విశ్వాసాలతో ముడిపడి వుంది. అందులో ప్రసిద్ధమైంది నరకాసుర వధ. ప్రాగ్జోతిషపురాధీశుడైన నరకుడు లోకకంటకుడై చెలరేగినప్పుడు సత్యభామా సమేతుడైన శ్రీకృష్ణుడు దండెత్తి సంహరించడం. నరక సంహారం వల్ల కలిగిన ఆనందోత్సాహాలకు సంకేతంగా ప్రజలు దీపావళి జరుపుకోవడం

జర జాగ్రత్త

⟹ కాటన్ బట్టలు వేసుకోవాలి. అదీ శరీరానికి అతికినట్టుగా ఉండేవైతే మంచిది. లూజుగా వేళ్లాడే సిల్కు బట్టలు త్వరగా మంట అంటుకోవడానికి వీలుంది.

⟹ టపాసులు కాల్చేటప్పుడు తప్పని సరిగా చెప్పులు వేసుకోవాలి.

⟹పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చాలి. చేతికి దగ్గరగా బకెట్ నిండా నీళ్ళు పెట్టుకోవాలి.

⟹ బాణాసంచాను ఇంటి బయట మైదానంలో కాల్చాలి.

⟹నగం కాలిన వాటిని మళ్లీ అంటించేందుకు ప్రయత్నించకూడదు.

⟹ కాకర పువ్వొత్తులు, విష్ణుచక్రాలు కాల్చాక ఇనుప సువ్వలను ఎక్కడపడితే అక్కడ విసిరివేయకూడదు. ఒక మూలన నగం వరకు నీళ్లున్న బకెట్లో వేయాలి. లేకపోతే చూసుకోకుండా నడిచే వారికి కాళ్లల్లో దిగవచ్చు లేదా కాలవచ్చు.

⟹ బాణాసంచాను జేబుల్లో వేసుకొని తీసుకెళ్లకూడదు. అలాగే అన్ని టపాకాయలను ఒక్కసారిగా బయటకు తీసుకెళ్లకూడదు. పొరపాటుగా వాటిమీద ఏదన్నా టపాకాయ వచ్చిపడిందంటే అన్నీ ఒక్కసారిగా పేలతాయి.

⟹ ఒకసారి ఒక్క టపాకాయను మాత్రమే కాల్చాలి.

⟹పెంపుడు జంతువులకు పెద్ద పెద్ద శబ్దాలన్నా, కళ్ళు మిరుమిట్లు గొలిపే వెలుగులన్నా భయం. అవి బెదిరిపోతాయి. అందుకే వాటిని బాణాసంచా కాల్చే ప్రదేశాలకు దూరంగా ఉంచాలి.

⟹ టపాసులను వెలిగించాక పేలకపోతే.. దగ్గరకు వెళ్లి బాగా వంగి చూస్తుంటారు. అలా ఎట్టి పరిస్థితిలోనూ చేయకూడదు. అలాంటి టపాసులను మళ్లీ వెలిగించే ప్రయత్నమూ చేయకూడదు. అంతేకాకుండా కనీసం ఐదు నిమిషాలు వేచి చూసి.. వాటిమీద నీళ్లు పోస్తే సరిపోతుంది. బాణాసంచా పేల్చేటప్పుడు సిగరెట్లు తాగకూడదు. మద్యం సేవించి ఉండకూడదు. టపాసులు కాల్చడం అయిపోయాక సబ్బుతో కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. లేకుంటే ఆ చేతులనే కళ్లల్లో, ముక్కులో పెట్టుకునే ప్రమాదం ఉంది. కాళ్లూ, చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేయడం కూడా చాలా ప్రమాదం.

మొదలుపెట్టారట. అందుకే దక్షిణ భారతంలో త్రయోదశి నాడు మొదలయ్యే పండుగ మర్నాడు (నరక) చతుర్దశి నాటికి తారస్థాయి నందుకొంటుంది. తర్వాత అమావాస్య. దక్షిణ భారతంలో ఈ మూడురోజులు చేసుకుంటే ఉత్తరాదిన మరో రెండు రోజులు కూడా సాగుతుంది. మరో కథ రామాయణ సంబంధమైంది. రాముడు రావణుడిపై విజయం సాధించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా జనం దీపావళి మొదలు పెట్టారని. విజయదశమికి రాముడు విజయం సాధించాడు గనక ఆయన తిరిగి వచ్చేసరికి ఆ మాత్రం వ్యవధి పట్టి వుండొచ్చు. శ్రీరామ పట్టాభిషేకం కూడా ఆ రోజునే జరిగిందని పురాణం. చరిత్రలో విక్రమార్క శకాన్ని మొదలెట్టిన విక్రమార్క చక్రవర్తి కూడా దీపావళి రోజునే పట్టాభిషేకం చేసుకున్నాడట. ఆ రోజునుంచి శక సంవత్సరం మొదలవుతుంది. ఇక భిన్న విశ్వాసాలకు ఆలవాలమైన భారతదేశంలో మరో కథ బలి చక్రవర్తికి సంబంధించింది. దానశీలుడైనప్పటికీ దానవ రాజు కనక బలి. విష్ణుమూర్తి వామనావతారంలో వచ్చి మూడడుగుల నేల దానంగా అడిగి మూడో అడుగు శిరస్సుపై మోపి పాతాళంలోకి తొక్కేస్తాడు. దేవ దానవ సంగ్రామ గాథలు ఆర్య అనార్య ఘర్షణను సూచిస్తాయనేది తెలిసిన విషయమే. ద్రవిడ జాతికి చెందిన వాడు కనక బలి దాక్షిణాత్యులకు పూజనీయుడే. కేరళీయులు ఓనం పండుగ బలి పునరాగమనానికి స్వాగతం చెబుతూ జరుపుకొంటారు. దీపావళికి కూడా కొన్ని ప్రాంతాల్లో ఈ కథనే మూలంగా చెబుతారు. పాతాళానికి అణగదొక్కబడిన బలి తను పాలించిన భూ మండలాన్ని చూసేందుకు పైకి వస్తాడని, అలా వచ్చేప్పుడు ఆయనకు దారి తెలిపేందుకై దీపాలు ఏర్పాటు చేస్తారని మరో కథ. ఇక బౌద్ధ జైన మతాల్లో కూడా దీనికి సంబంధించిన కథలున్నాయి.జైన మతాచార్యుడైన వర్ధమాన మహావీరుడు అమావాస్య రోజున మరణించడంతో దేవతలు ఆయన పట్ల స్వాగత సూచకంగా నగరమంతా దీపాలు వెలిగించడంతో ఈ పండుగ మొదలైందని వారి కథ. బౌద్ధ జాతక కథల్లోనూ ఈ రోజున బుద్ధుని చుట్టూ దీపాలు పెట్టి పూజించినట్టు వుంటుంది (బహుశా ఇది తర్వాత కాలంలో చేరినదై వుండాలి). జహంగీర్ కోటలో బందీగా వున్న సిక్కు గురువు గోవింద సింగ్ తన వారిని కూడా విడిపించుకొని అమృతసర్‌కు చేరింది దీపావళి రోజునేనట.

అన్ని చోట్లా వుంది...

భారతదేశంలోనే గాక ఇతర







చోట్ల కూడా ఇలాంటి పండుగలు, వాటితో ముడిపడిన విశ్వాసాలు చాలా వున్నాయి. మందుగుండు కనిపెట్టిందే చైనా వారని విజ్ఞాన శాస్త్ర చరిత్ర చెబుతుంది. వారూ పితృదేవతల సంస్మరణ కోసం ఫిబ్రవరి నెల ప్రారంభంలోనూ, జూన్‌లోనూ రెండు సార్లు దీపాల పండుగ జరుపుకొంటారు (ఇక్కడ దీపావళికి, నాగుల చవితికి చేసినట్టు). ఈజిప్టులోనూ మరణించిన వారి గౌరవార్థం వారి ఆత్మలు తిరిగి వస్తే దారి కనిపించాలని నవంబరు మూడవ వారంలో దీప మాలికలు వేలాడదీసేవారు. ఇక అమెరికాలోనైతే ఇంచుమించు ఇదే సమయంలో నవంబర్ మొదటి వారంలోనే హాలోవీన్ పేరిట దీపాల పండుగ వుంటుంది. క్రైస్తవుల ఆల్ హాలోస్, ఆల్ సెయింట్స్ డేను కూడా దీనితో పోల్చవచ్చు. ఇలాగే ఈజిప్టు, యెమెన్ దేశాలలో దీపదానం చేసే సంప్రదాయం వుండేది. అది కూడా డిసెంబర్ 25న అంటే క్రిస్మస్ రోజు. ఇక మహమ్మదీయులైతే మహమ్మద్ పైగంబర్ అనే కొత్త సంప్రదాయాన్ని స్థాపించి మక్కాకు తిరిగి చేరుకోవడానికి సూచికగా దీపాల పండుగ జరుపుతారు.
మహమ్మదీయులతో సంబంధాలు పెరిగిన తర్వాతే మనకు దీపావళి బాణసంచా కాల్చే ఆచారం మొదలైందని కొందరు చెబుతారు. అలాగే అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం రోజున (జులై 4) పెద్ద ఎత్తున టపాసులు కాలుస్తారు. బ్రిటన్‌లో నవంబర్ 5వ తేదీన "గైఫేక్స్ నైట్" సందర్భంగా టపాసులు కాలుస్తారు. దీనికి ఒక కారణం వుంది. గైఫేక్స్ నైట్ అనే వ్యక్తి తన సహచరులతో కలిసి బ్రిటన్ పార్లమెంట్ భవనాన్ని తగలపెట్టాలని చూశాడు. అందుకు గానూ వెస్ట్‌మినిస్టర్ హాల్ సెల్లార్‌లో 36 బారెళ్ళ మందుగుండు పొడిని సిద్ధం చేశాడు. అయితే నవంబర్ 5వ తేదీన ఫేక్ అరెస్ట్ కావడంతో పార్లమెంట్ సురక్షితంగా బయటపడింది. అందుకే ప్రతిసంవత్సరం ఆ రోజున గైఫేక్స్ దిష్టిబొమ్మను దహనం చేసి సంతోషంగా బాణాసంచా పేలుస్తారు. అదేవిధంగా కెనడా డే రోజు ఆదేశంలో టపాసులు కాలుస్తారు. మొత్తంపైన అన్ని దేశాలలోనూ అన్ని మతాలలోనూ కూడా దీపావళి పండుగ పితరులతో ముడిపడి వుండటం గమనార్హం.

దీపావళి-ప్రకృతి

ప్రకృతి మార్పులతోనూ దీపావళికి సంబంధం వుంది. అమావాస్య రోజున సూర్య చంద్రులు వుభయులూ స్వాతి నక్షత్ర సంచారం చేస్తారు. అందువల్ల అమావాస్య వస్తుంది. అయితే స్వాతి నక్షత్రం చాలా కాంతి వంతమైంది. స్వాతికి వాయుదేవుడికి సంబంధం వుందని పురాణ విశ్వాసం. అందుకు తగినట్టే వాయు గుండాలు, తుపానులు ఎక్కువగా నవంబర్ నెలలో కలుగుతుంటాయి. దీపావళి ముసురు స్వాతివాన అనే నానుడి కూడా వుంది.

దీపావళి అంటే సంబరాలు, సంరంభాలతో పాటు వ్యాపారాల హడావుడి కూడా చాలా ఎక్కువగా వుంటుంది. వినాయక చవితితో మొదలు పెట్టిన ఈ హడావుడి దసరాతో పెరిగి దీపావళికి తారాస్థాయికి చేరుతుంది. రకరకాల ఆకర్షణలు, ఉచిత కానుకలతో వినియోగ దారులను ఆకర్షించేందుకు కంపెనీలు పెద్ద ప్రయత్నం చేయడం చూస్తూనే వున్నాం. ఇదిగాక స్వీట్ల వ్యాపారం కూడా వూపందుకుంటుంది.

టపాసుల సందడి

దీపావళి చాలా దూరంలో వుండగానే టపాకాయల తయారీ ప్రారంభమవుతుంది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త టపాకాయలు, ముఖ్యంగా కాంతులీనే తారాజువ్వలు వగైరాలు కనిపెట్టి వదులుతుంటారు. దేశంలో శివకాశి ఇందుకు పేరెన్నిక కన్నది. శివకాశిలో బాలకార్మికుల చాకిరీ, భద్రతా రాహిత్యం వంటివి నిరంతరం వినిపించే విషయాలే. మందుగుండు తయారీలోనూ, నిల్వచేయడంలోనూ, అమ్మకంలోనూ, వాటితో ఆడుకోవడంలోనూ అన్నిదశల్లో ప్రమాదాలు జరుగుతుంటాయి. వాటిని నివారించేందుకు ముందు నుంచి జాగ్రత్తలు ప్రచారం చేస్తున్నా ఆ క్షణం ఉత్సాహంలో అవన్నీ మర్చి పోతుంటారు (అందుకే ఆ జాగ్రత్తలు మీ కోసం మరోసారి బాక్సు కట్టి ఇస్తున్నాం). దాంతో కాల్చేవారికే కాక చుట్టు పక్కల వారికి కూడా ప్రమాదాలు వచ్చి పడుతుంటాయి. మరే పండుగ కన్నా కాంతి వంతమైన శోభాయమానమైన దీపావళి వెలుగులతో పాటు చీకటిని కూడా గుర్తు చేసే సందర్భమిది.

ప్రజల జీవితాల్లో దీపావళి ఎంతగా పెనవేసుకు పోయిందంటే ఎవరికైనా మరీ సంతోషకరమైన పరిస్థితి ఎదురైతే 'ఇక దీపావళే' అంటారు. క్రీడలు, ఉత్సవాలు దీపాన్ని వెలిగించి ప్రారంభిస్తారు. మహనీయుల సమాధుల వద్ద దీపాలు నిరంతరం వెలిగేలా చేస్తారు. సంతోషాన్ని విచారాన్ని కూడా సమానంగా వ్యక్తం చేసే గుణం దీపానికి వుంది. అలాంటి దీపావళికి స్వాగతం పలుకుదాం! సమస్యలు తొలగిపోయి అందరి జీవితాల్లో సంతోషపు వెలుగులు రావాలని ఆశించుదాం!

*

ఆచారాలు

ఎందుకు మొదలైనప్పటికీ దీపావళి పండుగతో పాటు అనేక ఆచారాలు స్థిరపడిపోయాయి. ఈ పండుగ రోజున తలంటి పోసుకోవడం, కొత్తబట్టలు ధరించడం, బంధు మిత్రుల ఇళ్లకు వెళ్లి నమస్కరించి ఆశీర్వాదాలు పొందడం జరుగుతుంటుంది. ఆర్థిక స్తోమత గలవారు లక్ష్మీదేవికి బంగారు వెండి కానుకలు సమర్పిస్తారు. ఆర్థిక సంవత్సర సూచికగా మార్వాడీలు కొత్త ఖాతా పుస్తకాలు తెరుస్తారు. ఎందుకంటే మార్వాడీలు ఎక్కువగా పాటించే జైన విశ్వాసంలో నూతన సంవత్సరం దివాళితోనే మొదలవుతుంది. బెంగాల్‌లోనైతే దసరాకు కొనసాగింపుగా దేవీ పూజలు నిర్వహిస్తారు.కొన్ని ప్రాంతాల్లో ఈరోజున పప్పు దినుసులు తినరు. ఉత్తర ప్రదేశ్‌లో మాధుర్లు దీపావళికి నూనెలో వేయించిన అనేక పిండి వంటలు చేసుకుంటారు.మహారాష్ట్రులు కూడా ఘనంగానే జరుపుతారు. కృష్ణాష్టమి రోజున చేసినట్టుగా లక్ష్మీ దేవి పాదాలు వేయడం, సంక్రాంతి నాటి వలె ముగ్గులు వేయడం కూడా కొన్ని చోట్ల చూస్తాం. గిరిజనులైతే గోడల మీద కూడా అందాల ముగ్గులు, చిత్రాలు తీర్చిదిద్దుతారు.

కారు మీది ప్యాసింజర్లు 49 మంది

ఆ రోజు... అందరి చూపూ మారుతీ 800 మీదే. ఊపిరిబిగబట్టి మరీ చూశారు. కారణం కదిలే ఆ వాహనం మీద మొత్తం 49 మంది వున్నారు మరి. వారిలో ఒక్కరు కూడా కిందపడకూడదని ఎన్ని దేవుళ్లకు మొక్కుకున్నారో లెక్కేలేదు. ఇంతమంది వున్న ఆ వాహనం 13 నిముషాల 47 సెకన్లలో 2 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. ఇంతకీ ఆ బండి నడిపింది ఎవరనుకున్నారు?! ఓ మహిళ. పేరు పూన్‌కోడి. నివాస ప్రాంతం తిరుచిరాపల్లి (తమిళనాడు). వయసు 39 లెండి! ఈ దెబ్బతో ఆమె పేరు లిమ్కా బుక్‌లో ఎక్కింది. కారుమీద కూర్చున్నవారంతా 12 నుంచి 39 సంవత్సరాల లోపువారే. ఇంత పెద్ద సాహసం ఒక్కరోజులో చేసేది కాదుకదా. బాగా సాధన చేస్తేనే కదా సాధ్యం. ఈమె ప్రాక్టీస్ చేసేటప్పుడు మాత్రం 47 మందితోనే సరిపెట్టుకుంది. అయితే తీరా ప్రదర్శన రోజు మాత్రం 49 మందిని లాగించేసిందా లేడీ బాస్.

84 ఏళ్లగా రోడ్లు ఊడుస్తున్న బామ్మ

బామ్మ పేరు: డింగ్ యోజెన్
వయసు: 104
దేశం, ప్రాంతం: చైనా, డోంగ్టిక్ సిటీ
హాబీ: రోడ్లు ఊడ్వడం (అదీ ఫ్రీగా)
ఎప్పటి నుంచి: తను 20లలో అడుగెట్టిన దగ్గర నుంచి (దాదాపు 84 ఏళ్లగా)

అసలా అలవాటు ఎలా వచ్చింది?: దానికో బుల్లి ఫ్లాష్ బాక్ వుంది. తెల్సుకోవాలంటే... మరి మేఘాల్లోకి వెళ్లిపోవాల్సిందే... (పాత సినిమాల్లో అలాగే చూయిస్తారుగా. అందుకని)

బామ్మ, తాతయ్య మొదట చాయ్ దుకాణం నడిపేవారు. అదీ ఇంటి దగ్గరే. టీ వ్యాపారం బాగా నడవాలంటే పరిసరాలు శుభ్రంగా వుండాలని భావించారు ఇద్దరూ. అంతే...ఆ క్షణం నుంచి ఇప్పటి వరకు బామ్మ రోడ్లు ఊడుస్తూనే వుంది. అదీ తమ ఇంటి దగ్గర నుంచి పెద్ద బజారు వరకు. ఈ మధ్యే టీ దుకాణం తీసేశారు. అయినా అలవాటు మానుకోలేదు బామ్మ. ఎంతైనా అలవాటు పడిన పని కదా. ఈ వయసులో కూడా అలా చేసుకుపోతోంది మరి.

సమ్‌థింగ్ స్పెషల్

-కె.చరిత



ఏంటలా నోరెళ్లబెట్టి చూస్తున్నారు! మనకు వినడానికి వింతగా వున్నా... మధురై డాక్టర్లకు ఇది మామూలు విషయం. ఇదే నగరానికి చెందిన జగన్నాథన్ అనే డాక్టరుగారికి టామీ అనే కుక్క వుంది. దానికి జస్ట్ పదమూడేళ్లే. వయసు పైబడడం వల్ల కళ్లు కనిపించక... పాపం తడబడుతూ నడిచేది. ఈ విషయం గమనించిన డాక్టరుగారు దాన్ని పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టరు గారు ఆపరేషన్ చేయాలన్నారు. ఈ డాక్టరుగారు తల ఊపేశారు. ఫలితంగా టామీకి కాటరాక్ట్ ఆపరేషన్ జరిగిపోయింది. అదిప్పుడు దర్జాగా నడుస్తోంది. చక్కగా ఆడుకుంటోంది. అంటే దానికి చూపు బాగుపడినట్టేకదా. మరో డాక్టరుగారు ఓ పిల్లికి కూడా కంటి ఆపరేషన్ చేశారు. అది కూడా కొత్తగా వచ్చిన చూపుతో సంతోషంగా తిరుగుతోందట.

కుక్కలు, పిల్లులకు కంటి ఆపరేషన్

మనం బోలెడన్ని కుక్కలను చూసి వుంటాం. బాగా పెద్దవి...బాగా చిన్నవి...చాలా లావాటివి... సన్నటివి... తెల్లవి... చుక్కలవి... నల్లవి.. .పొట్టి ముక్కు కుక్కలు... ఒళ్లంతా చర్మం ముడతలు పడినట్టుండేవి...ఇలా...బొచ్చెడు చూసి వుంటారు. అయితే ఇవాళ మీ ముందున్న శునకం మాత్రం మామూలుది కాదు. ఆ విషయం మీకు మొదటి చూపులోనే అర్థమైవుంటుంది.



చూశారుగా.... జస్ట్... కూల్ డ్రింక్ డబ్బా అంత సైజు మాత్రమే వుంది. దీని పేరు హెవెన్ సెంట్ బ్రాండీ. దీన్ని చూడాలంటే మాత్రం ఫ్లోరిడా వెళ్లాల్సిందేలెండి. అది కనీసం వినబడేట్టు మొరగను కూడా మొరగలేదు. దాని కాళ్లు సింపుల్‌గా చంటిపిల్లలు తినే లాలిపాప్ అంత వుంటాయి. తోక దగ్గర నుంచి ముక్కు వరకు కొలిస్తే ఇది జస్ట్ 6 అంగుళాల పొడవు మాత్రమే. ఇదే ప్రపంచంలోకెల్లా పొట్టి కుక్కగా 2005లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకెక్కింది. ఇప్పటికీ ఆ రికార్డును తన పేరు మీదే కాపాడుకుంటూ వస్తోందిమరి. పొట్టిదైనా గట్టిదేనంటారా!

బుల్లి కుక్క

బుకర్ ప్రైజ్ కథాకమామిషు

ఎం.డి. హసన్ షరీఫ్



అరవింద్ అడిగా

బుకర్ ప్రైజ్... సాహితీ ప్రియులకు సుపరిచితమైన మాట. ఈ అవార్డును జీవిత కాలంలో ఒక్కసారైనా గెలిస్తేనే తాము రచించిన నవలలకు సార్థకత లభిస్తుందని ప్రతి నవలా రచయితా భావిస్తుంటాడు. బుకర్ ప్రైజ్ సాధిస్తే రచయితగా అంతర్జాతీయ గుర్తింపు సంపాదించడంతో పాటు తమ రచనలకు ప్రపంచ వ్యాప్తంగా భారీ గిరాకీని సంపాదిస్తారు. ఈ అవార్డు భారతీయులను అప్పుడప్పుడు వరిస్తూనే ఉంది. ఈ ఏడాది అరవింద్ అడిగా తాజాగా 'మ్యాన్ బుకర్ ప్రైజ్' విజేతగా నిలిచాడు. అసలు బుకర్ ప్రైజ్ అంటే ఏంటి...రచయితల డ్రీమ్‌గా నిలిచే ఆ అవార్డుకు అంత ప్రాధాన్యత ఎందుకు... తెలుసుకోవాలనుకుంటున్నారా?... అయితే చదవండి...

బుకర్ ప్రైజ్ అవార్డును ప్రతి ఏడాది ఉత్తమ నవలకు అందజేస్తారు. కామన్వెల్త్ దేశాలకు లేదా ఐర్లాండ్‌కు చెందిన రచయితలకే ఈ అవార్డు లభిస్తుంది. బుకర్ ప్రైజ్ విజేతకు అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రచారం లభిస్తుంది. దీంతో ఆ నవలకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. బుకర్ ప్రైజ్‌కు నామినేట్ అయిన లేదా షార్ట్‌లిస్ట్ అయిన నవలలకు కూడా సాహిత్యాభిమానుల నుండి ఆదరణ మెండుగా ఉంటుంది.

40 ఏళ్ల చరిత్ర

బుకర్ ప్రైజ్ అసలు పేరు బుకర్-మెక్ కానల్ ప్రైజ్. ఈ అవార్డును 1968లో బుకర్-మెక్ కానల్ అనే కంపెనీ ప్రారంభించింది. ఆ కంపెనీ ఆర్థిక సహాయంతో ఇస్తున్న అవార్డును 'బుకర్ ప్రైజ్ లేదా 'ద బుకర్' అని పిలుస్తారు. ఈ అవార్డు నిర్వాహణను బుకర్ ప్రైజ్ ఫౌండేషన్‌కు 2002లో బదలాయించారు. టైటిల్ స్పాన్సరర్‌గా 'మ్యాన్ గ్రూప్' వ్యవహరిస్తోంది. అందుకే బుకర్‌కు ముందు టైటిల్ స్పాన్సరర్ పేరుతో 'మ్యాన్ బుకర్' అని అవార్డు పేరును అధికారికంగా మార్చారు. బుకర్ ప్రైజ్‌కు ఇచ్చే పారితోషికాన్ని తొలుత 21 వేల పౌండ్లుగా నిర్ణయించారు. అయితే 2002లో స్పాన్సర్‌షిప్ లభించిన తర్వాత పారితోషికం మొత్తాన్ని 50 వేల డాలర్లకు పెంచారు.

జడ్జీలు

విజేతను ఎంపిక చేసేందుకు ఒక అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో ఒక రచయిత, ఇద్దరు పబ్లిషర్లు, ఒక సాహితీవేత్త, ఒక బుక్ సెల్లర్, ఒక లైబ్రేరియన్, బుకర్ ప్రైజ్ ఫౌండేషన్ నియమించిన ఛైర్‌పర్సన్ సభ్యులుగా ఉంటారు. ఈ అడ్వయిజరీ కమిటీ జడ్జీల ప్యానెల్‌ను ఎంపిక చేస్తుంది. ప్రతి ఏడాది జడ్జీలను మారుస్తూ ఉంటారు. అరుదుగా రెండోసారి కూడా ఎంపిక చేస్తారు. జడ్జీలుగా ప్రముఖ సాహిత్య విమర్శకులు, రచయితలు, అకాడమిక్స్, ప్రముఖులను ఎంపిక చేస్తారు.

ప్రైజ్ గెలుచుకున్న ఐదవ భారతీయుడు

ఈ ఏడాది మ్యాన్ బుకర్ ప్రైజ్ (2008)ను అరవింద్ అడిగా గెలుచుకున్నారు. అతడు రచించిన 'వైట్ టైగర్' అనే నవలకు ఈ అవార్డు లభించింది. అతడికి అవార్డుతో పాటు 50వేల పౌండ్లు (87 వేల డాలర్లు) కూడా లభించాయి. ఈ నవలను అట్లాంటిక్ అనే సంస్థ పబ్లిషింగ్ చేసింది. లండన్‌లోని గుయిల్‌ధాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో 33 ఏళ్ల అరవింద్‌కు ఈనెల 14వ తేదీన ఈ అవార్డును బహూకరించారు. 40 ఏళ్ల బుకర్ ప్రైజ్ చరిత్రలో తొలి నవలకే అవార్డును సొంతం చేసుకున్న నాలుగవ రచయితగా, రెండవ భారతీయుడిగా అరవింద్ ఘనత సాధించాడు. తొలి రచనకే అవార్డు సాధించిన ఇతర రచయితలు - కెరీ హల్మీ (ద బోన్ ప్యూపుల్-1985), డిబిసి.పీయిర్ (వర్నన్ గాడ్ లిటిల్-2003), అరుంధతీ రాయ్ (గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్-1997). చిన్నప్పటి నుండి నవలా రచయితగా గుర్తింపు సంపాదించాలనుకున్న అరవింద్ మద్రాస్‌లో జన్మించి ముంబయిలో నివసిస్తున్నాడు. ఈ అవార్డు సాధించిన ఐదవ భారతీయుడిగా కూడా ఇతడు నిలిచాడు. వివిఎస్.నైపాల్ (1971), సల్మాన్ రష్డీ (1981), అరుంధతీ రాయ్ (1997), కిరణ్ దేశాయ్ (2006) అవార్డు సాధించిన ఇతర భారతీయులు. భారత్‌ను స్ఫూర్తిగా, భారత సమాజానికి సంబంధించిన నవలకు అవార్డు రావడం ఇది తొమ్మిదోసారి. అరవింద్ విజేతగా నిలిచినట్లు జడ్జీల కమిటీ ఛైర్మన్ మైకేల్ పోర్టిల్లో ప్రకటించారు. మ్యాన్ గ్రూప్ ఆఫ్ పబ్లికేషన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పీటర్ క్లార్క్ 50 వేల పౌండ్ల చెక్కును అరవింద్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమం బిబిసి పదిగంటల వార్తల్లో ప్రత్యక్ష ప్రసారమైంది.

అరవింద్ అడిగా గురించి

మద్రాస్‌లో అక్టోబర్ 23, 1974లో జన్మించిన అరవింద్ అడిగా తల్లిదండులు ఉషా అడిగా, కన్నడిగా. మంగళూర్‌లోని కనరా హైస్కూల్‌లో, సెయింట్ అలాయ్‌సియాస్ కాలేజీలో విద్యాభ్యాసం చేశారు. ఎస్ఎస్ఎల్‌సిలో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించారు. తర్వాత ఆయన కుటుంబం ఆస్ట్రేలియాలోని సిడ్నీకి వలసపోయింది. కొలంబియా యూనివర్శిటీలోని కొలంబియా కాలేజీలో ఇంగ్లీషు సాహిత్యం చదివారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలోనూ విద్యాభ్యాసం చేశారు.

టైమ్ మ్యాగజైన్‌కు భారత్‌లో ప్రతినిధిగా జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. మనీ, ద వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రికల ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. టైమ్‌లో దక్షిణ భారత ప్రతినిధిగా మూడేళ్లపాటు కొనసాగారు. తర్వాత ఫ్రీలాన్సర్‌గా మారారు. ఆయన రాసిన ఆర్టికల్స్ ఫైనాన్షియల్ టైమ్స్, ఇండిపెండెంట్, సండే టైమ్స్ తదితర పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అతడికి భారత్, ఆస్ట్రేలియా దేశాల పౌరసత్వం ఉంది. ఆయన ప్రస్తుతం ముంబయిలో నివసిస్తున్నారు.

ద వైట్ టైగర్‌లో ఏముంది?

విచక్షణ లేకుండా, క్రూరంగా ప్రవర్తించే తీరుకి నిదర్శనం 'తెల్లపులి'. ఈ నవల కథ కూడా దాన్ని ప్రతిబింబిస్తుంది. భారత్‌లో కోటీశ్వరులు ఎక్కువగా ఉన్నారని అంతర్జాతీయంగా మార్మోగుతోంది. అదే సందర్భంలో మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులతో లోలోపలే కుమిలిపోతున్న తీరు, గ్రామీణ ప్రాంతాల్లో తాండవిస్తున్న పేదరికం, నిరక్షరాస్యత, బాల కార్మిక వ్యవస్థల తీరుతెన్నులను అరవింద్ తన నవలలో వివరణాత్మకంగా అందించారు. జర్నలిస్టుగా అతడు దక్షిణ భారత దేశంలోని వ్యక్తుల జీవితాల తీరుతెన్నులను దగ్గరగా గమనించాడు. అందుకే తన నవలలో అన్ని రసాలనూ అలవోకగా ఇమడ్చగలిగాడు.

కథలోకి వెళ్తే బలరామ్ ఒక రిక్షా కార్మికుని కొడుకు. పేదరికం వల్ల చదవలేక టీ కొట్టులో బాల కార్మికుడిగా పనిచేస్తాడు. గ్లాసులు కడగడం, టేబుళ్లు తుడవడం, టీ అందించడం... ఇంత పనిచేసినా కడుపు నిండా తినడానికి కూడా లభించేది కాదు. ఆకలి కేకలకు తోడు అతడుండే గ్రామంలో కులమతాల పట్టింపులు, ఉన్నవాళ్లు లేనివాళ్లు అనే తేడాలు కృంగదీసేవి. అదే సందర్భంలో తండ్రి క్షయ వ్యాధితో మరణించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బలరామ్‌ను ఒక పెద్ద వ్యాపారి న్యూఢిల్లీ తీసుకెళ్తాడు. గ్రామంలో కటిక దారిద్ర్యాన్ని చూసిన అతడు దేశ రాజధానిలో విలాసవంతమైన జీవితాన్ని గడిపేవారిని దగ్గర నుండి గమనిస్తాడు. సంపన్నుడైన తన యజమాని విలాసాల్లో తేలియాడుతూ ఉంటాడు. బలరామ్ డ్రైవర్‌గా యజమాని కుటుంబాన్ని సినిమాలకు, షాపింగ్ మాల్స్‌కు వాహనంలో తీసుకెళ్తుంటాడు. విందు వినోదాలతో, జల్సాగా సాగే ఈ ఖరీదైన జీవితాన్ని, తాను కూడా అనుభవించాలన్న కోరిక రోజురోజుకూ బలరామ్‌లో పెరుగుతుంది. డబ్బులుంటేనే ఇదంతా సాధ్యమని భావించిన బలరామ్ ఒకరోజు యజమానిని హత్యచేసి అతడి ఆస్తిని దోచుకొచ్చి బెంగుళూర్‌లో పెద్ద వ్యాపారిగా కొత్త అవతారం ఎత్తుతాడు. సమాజంలో పరస్పరం వ్యతిరేకంగా ఉన్న పరిస్థితులు ప్రజలను ఎలా పక్కదారి పట్టిస్తుంటాయో, వారి ఆలోచనా విధానాలను ఎలా మారుస్తున్నాయో ఈ నవల విశ్లేషణాత్మకంగా అందించింది. ఒక రిక్షా కార్మికుడు ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదిగిన తీరు, ఆ క్రమంలో దేశంలోని స్థితిగతులను, కోట్ల మందికి విద్య, వైద్యం అందని తీరును కళ్లకు కట్టినట్లు వివరిస్తాడు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలకు వలస వచ్చి సామాన్యులు బతకలేక, వెనుదిరిగి పోలేక పడే నరకయాతనను వర్ణించిన తీరు అద్భుతం.

సాహిత్య నోబెల్ ప్రైజ్ విజేత లీ క్లెజియో

2008 సంవత్సరపు సాహిత్య నోబెల్ ప్రైజ్ ఫ్రెంచ్ రచయిత జీన్-మారీ గుస్టావో లీ క్లెజియోకు లభించింది. ఈ అవార్డును స్వీడిష్ అకాడమీ శాశ్వత కార్యదర్శి ప్రొఫెసర్ హోరేస్ ఇంగ్‌డాల్ ప్రకటించారు. ఈ అవార్డు విజేతకు 10 మిలియన్ స్వీడిష్ క్రోనా (815,000 డాలర్లు) అందజేశారు. లీ క్లెజియో బుకర్ ప్రైజ్ కోసం మూడుసార్లు షార్ట్‌లిస్ట్‌లో పేరు సంపాదించి రెండుసార్లు ఆ ప్రైజ్ సాధించాడు.

షార్ట్‌లిస్ట్ చేసిన ఆరు నవలలు

ద సీక్రెట్ స్క్రిప్చర్- సెబాస్టియన్ బారీ
సీ ఆఫ్ పాపీస్- అమితావ్ ఘోష్
ద క్లాత్స్ ఆన్ దేర్ బ్యాక్స్- లిండా గ్రాంట్
ద నార్తర్న్ క్లెమెన్సీ-ఫిలిప్ హెన్షర్
గ్రాక్చన్ ఆఫ్ ద హోల్-స్టీవ్ టాల్ట్స్

షార్ట్‌లిస్ట్ చేసిన ప్రతి నవలకు 2,500 పౌండ్ల ప్రైజ్‌మనీ లభిస్తుంది.

వాస్తవాలు... గణాంకాలు

– ప్రతి పబ్లిషర్ ఇమ్‌ప్రింట్ రెండు టైటిల్స్‌ను సబ్‌మిట్ చేయాలి. అదనంగా గతంలో ప్రైజ్ విజేతలు, గత పదేళ్లుగా షార్ట్‌లిస్ట్ చేసిన వారు ఆటోమేటిక్‌గానే పరిగణింపబడతారు. 21వ శతాబ్దంలో జడ్జీలకు అందిన సగటు పుస్తకాల సంఖ్య 130.



– జడ్జీల వద్దకు వచ్చిన నవలల జాబితాను తొలుత 2001లో వెల్లడించారు. 2003లో 23 నవలలు, 2002లో 20, 2001లో 24 నవలలు బుకర్ ప్రైజ్ కోసం వచ్చాయి.

– బుకర్ ప్రైజ్ చరిత్రలో తొలి 35 ఏళ్లలో ఐదుసార్లు మాత్రమే ఆరుకంటే తక్కువ పుస్తకాలను షార్ట్‌లిస్ట్ చేశారు. 1980, 81ల్లో ఏడు పుస్తకాలను షార్ట్‌లిస్ట్ చేశారు.

– మొత్తం మీద తొలి 35 ఏళ్లలో 135 మంది రచయితలకు చెందిన 201 పుస్తకాలను షార్ట్‌లిస్ట్ చేశారు.

– ఒకసారి నామినేట్ అయిన 97 మంది నవలా రచయితల్లో 13 మంది విజేతలుగా నిలవగా, ముగ్గురిని సంయుక్త విజేతలుగా ప్రకటించారు.

– రెండుసార్లు నామినేట్ అయిన 19 మంది నవలా రచయితల్లో ఏడుగురు విజేతలుగా నిలిచారు. జెఎం.కొయెట్జీ రెండుసార్లు విజయం సాధించాడు.

– మూడుసార్లు నామినేట్ అయిన 10 మంది రచయితల్లో నలుగురు విజేతలుగా, ఒకరు సంయుక్త విజేతగా నిలిచారు. పీటర్ కారీ రెండుసార్లు విజేతగా నిలిచాడు.

– నాలుగుసార్లు నామినేట్ అయిన ఆరుగురిలో విలియమ్ ట్రేవర్ మాత్రమే విజేతగా నిలిచాడు.

– ఇప్పటివరకు బ్రిటన్‌కు చెందిన 24 మంది రచయితలు విజేతలుగా నిలిచారు. ఆస్ట్రేలియా రచయితలు ఆరుగురు, ఐర్లాండ్‌కు చెందిన ఐదుగురు, భారత్‌కు చెందిన నలుగురు రచయితలు విజేతలుగా నిలిచారు.

*

మీకు తెలుసా?

సల్మాన్ రష్దీ రచించిన 'మిడ్‌నైట్స్ చిల్డ్రన్' అనే నవలకు 1993లో 'బుకర్ ఆఫ్ బుకర్ ప్రైజ్' లభించింది. అంటే 1981లోనే బుకర్ ప్రైజ్ గెలుచుకున్న ఆ నవల గత 25 ఏళ్లలో అత్యుత్తమమైనదిగా గుర్తింపు పొందిందన్నమాట. బుకర్ ప్రైజ్ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అవార్డు ఇచ్చారు. బుకర్ ప్రైజ్ 40వ వార్షికోత్సవం సందర్భంగా 2008లో కూడా బుకర్ ప్రైజ్ సాధించిన నవలల్లో ఉత్తమ నవలకు అవార్డు ప్రకటించారు. ఆ అవార్డు కూడా మిడ్‌నైట్స్ చిల్డ్రన్‌కే లభించడం విశేషం. ప్రపంచంలోని ఏ దేశానికి చెందిన రచయిత అయినా మ్యాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్‌కు అర్హత సాధించే కొత్త విధానాన్ని 2005లో ప్రవేశపెట్టారు. ఈ అవార్డును రెండేళ్లకోసారి ఇస్తారు. రష్యాకు చెందిన బుకర్ ప్రైజ్‌ను 1992లో ప్రారంభించారు.

బుకర్ ప్రైజ్ విజేతలు

సం	విజేత	దేశం	నవల
2008	అరవింద్ అడిగా	భారత్	ద వైట్ టైగర్
2007	అన్నే ఎన్‌రైట్	ఐర్లాండ్	ద గ్యాదరింగ్
2006	కిరణ్ దేశాయ్	భారత్	ద ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్
2005	జాన్ బాన్‌విల్లే	ఐర్లాండ్	ద సీ
2004	అలన్ హోలింగ్ హర్స్ట్	యుకె	ద లైన్ ఆఫ్ బ్యూటీ
2003	డిబిసి పియర్	ఆస్ట్రేలియా/మెక్సికో	వర్నాన్ గాడ్ లిటిల్
2002	యాన్ మార్టెల్	కెనడా	లైఫ్ ఆఫ్‌పీ
2001	పీటర్ కారీ	ఆస్ట్రేలియా	ట్రూ హిస్టరీ ఆఫ్ ద కెల్లీ గ్యాంగ్
2000	మార్గరెట్ అట్‌వుడ్	కెనడా	ద బ్లయిండ్ అసాసిన్
1999	జెఎం.కోయెట్‌జీ	దక్షిణాఫ్రికా/ఆస్ట్రేలియా	డిస్‌గ్రేస్
1998	ఇయాన్ మెక్‌ఎవాన్	యుకె	ఆమ్‌స్టర్‌డామ్
1997	అరుంధతీ రాయ్	భారత్	ద గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్
1996	గ్రాహమ్ స్విఫ్ట్	యుకె	లాస్ట్ ఆర్డర్స్
1995	పాట్ బార్కర్	యుకె	ద ఘోస్ట్ రోడ్
1994	జేమ్స్ కెల్మన్	యుకె	హౌ లేట్ ఇట్‌వస్, హౌ లేట్
1993	రాడి డాయిలీ	ఐర్లాండ్	పాడీ క్లార్క్ హా హా హా

విజ్ఞాన వీచిక

డా॥ కాకర్లమూడి విజయ్

భూమికే అన్ని అనుకూలతలా?

మనం మన భూమిని "మనదే" అనుకుంటున్నాం. మన ఇల్లే అనుకుంటున్నాం. కానీ భూమి గురించి చాలా విషయాలు మనకసలు తెలీదు. ఏదో ఒక ధూళి మేఘం నుండి భూమి తయరైందంటున్నారు. ఏవో వాయువుల నుండి జీవం వచ్చిందంటున్నారు... ఇతకీ అసలేం జరుగుతోంది?

ఇన్ని గ్రహాలుండగా మన గ్రహంపైనే జీవం, వాతావరణం, నీరు... అన్ని మంచి విషయాలూ మనకే ఎలా వచ్చాయి? "సౌర కుటుంబం" అనే గ్రహాల సముదాయాన్ని గమనిస్తే, ఒక్కో గ్రహం ఒక్కోచోటి నుండి వచ్చి సూర్యుడనే నక్షత్రం చుట్టూ తిరుగుతుందనిపిస్తుంది. ఎందుకంటే ఉన్న ఎనిమిది గ్రహాలూ ఒక్కోటీ ఒక్కొక్కరకరంగా ఒక దానికొకటి భిన్నంగా ఉన్నాయి. కానీ సుమారు 4.5 బిలియన్ సంవత్సరాల క్రితం అవన్నీ వాయువు, ధూళి కలిసిన ఒకే మేఘం నుండి ఏర్పడ్డాయి. ఆ మేఘాలు సూర్యుడి చుట్టూ వ్యాపించి ఉన్నాయి. గురుత్వాకర్షణ ఈ మేఘాన్ని లాగినప్పుడు ధూళి పదార్థాలు ఒక దానికొకటి అంటుకుని పెరిగిపోయాయి, దాంతో పాటే గరుత్వాకర్షణ కూడా పెరిగింది. అలా మనకు తెలిసిన గ్రహాలు తయారయ్యాయి.

ఈ విషయం బాగానేవుంది. కానీ, భూమిపై తొలిజీవం ఉద్భవిస్తున్న సమయంలో ఏం జరిగిందో ఇంకా అంతు చిక్కకుండానే ఉంది. ఆ రహస్యమే ఛేదించగలిగితే మన భూమిపైనే జీవం ఎందుకు చక్కగా మనగలుగుతుందో అర్థమౌతుంది, భూమి మాత్రమే జీవ మనుగడకు ఎందుకు అనుకూలంగా ఉందో తెలిసిపోతుంది. సూర్యుడికీ, భూమికీ ఉన్న దూరమే భూమిపై సరిపడినంత వేడి, కాంతి ఉండటానికి దోహదపడిందని మనకు తెలుసు. అయితే అదొక్కటే కారణం కాకపోవచ్చు. ప్రతి జీవిలో ఉండే ఆక్సిజన్, హైడ్రోజన్, కార్బన్, నైట్రోజెన్, ఫాస్ఫరస్, సల్ఫర్ల ప్రత్యేక మిశ్రమమే కాకుండా భూమిపై ద్రవరూపంలోని నీరు లేకపోతే జీవావిర్భావం భూమ్మీద జరిగేదే కాదనీ తెలుసు. అంటే రసాయనికంగానో, మరొకరకంగానో, ఇతర గ్రహాలకన్నా భూమే జీవాభివృద్ధికి సకల సదుపాయాలూ కలిగివుంది. కానీ ఇన్ని మంచి పదార్థాలు, అంశాలు మనకే ఎందుకు లభించాయి...!

బహుశ వేర్వేరు మూలకాలు వేర్వేరు ఉష్ణోగ్రతల్లో ఖగోళ మేఘంనుండి ద్రవీకరింబడ్డాయేమో. అయితే ఇది ఎలా జరిగిఉండవచ్చో మనకి తెలిసే అవకాశం భూమ్మీది శిలల ద్వారా తెలుసుకోవచ్చు గానీ, ఆ శిలలు వాతావరణ పరిస్థితుల వల్ల అనేకసార్లు మార్పు చెందడం వల్ల అది అసాధ్యం. మరి మిగతా గ్రహాలు చాలా దూరంగా ఉండటం వల్ల వాటినుండీ మనం అంత సులభంగా ఏమీ తెలుసుకోలేం. అయితే గ్రహాలతోపాటే ఏర్పడ్డ ఉల్కలు మనకి తోడ్పడవచ్చు. కానీ అందుకోసం అవి భూమ్మీద పడేవరకూ ఆగాలి.

కాండ్రైట్లనే రకం ఉల్కలు దాదాపు భూమిలాంటి నిర్మాణాన్నే కలిగివున్నాయి. అంటే ఆ ఉల్కలూ, భూమీ ఒకేరకం మూలపదార్థాల ద్వారా ఏర్పడి ఉండవచ్చు. కానీ కొన్ని విషయాల్లో పెద్ద తేడానే ఉంది.

ఉదాహరణకు, కాండ్రైట్లలోని ఆక్సిజన్ ఐసోటోప్ల మిశ్రమం భూమి తాలూకు ఆక్సిజన్ ఇసో టోపులతో కలవడం లేదు. ఇందుకు కారణం ఇంతవరకు ఎవరికీ తెలియడం లేదు. కానీ భూ వాతావరణంలో పుష్కలంగా ఉన్న ఆక్సిజన్ సంగతి చాలా కీలకమైన విషయం అన్నది ముఖ్యం.

మరో కీలక విషయం నీరు. భూమి ఏర్పడిన తొలిరోజుల్లో ద్రవరూపంలో నీరు భూమ్మీదికి ఎలా చేరిందన్నది ఇంకా సందిగ్ధమే. ఒకవేళ భూమి ఏర్పడిన మేఘాలనుండీ నీరూ ఏర్పడిందనుకోవడానికి అధిక ఉష్ణోగ్రత కారణమైన భారీ విస్ఫోటనం వేడికి ఆ నీరు ఆవిరై పోయివుండవచ్చు. ఒక కారణం ఏమైవుండవచ్చంటే సౌరకుటుంబం అంచులపైనున్న మంచు ఉల్కాపాతం వల్ల నీరు భూమి ఏర్పడ్డ కొంత కాలానికి ఏర్పడటం. అయితే భూమికి నీటికి ఇదే కారణం అనదగ్గ ఆధారాలు లేవు.

కాబట్టి మన భూమి దానిపైని ఇతర పదార్థాలు, పరిస్థితుల ఆవిర్భావంపై మరింత లోతైన అవగాహన అవసరం. ఈ సంవత్సరాంతంలో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రయోగించే హర్షెల్ స్పేస్ టెలిస్కోప్ బహుశ కొంత వివరణ ఇవ్వవచ్చు. అద్దంకంటే ఒకటిన్నర రెట్లు మందం ఉన్న ఈ టెలిస్కోపు ఇన్‌ఫ్రారెడ్ కిరణాల సాయంతో ధూళి మేఘాల అంతరాల అధ్యయనం సాగిస్తుంది. ఎందుకంటే అక్కడే కొత్త నక్షత్రాలూ, కొత్త గ్రహాలూ జన్మిస్తున్నాయి గనక. ఎందుకంటే అక్కడే ఏ కొత్త గ్రహమో భూమి అంత అదృష్టవంతురాలై జీవావిర్భావానికి అనుకూలతను పొందుపర్చుకుంటుంది కాబట్టి.

*

వీరి వీరి గుమ్మడి పండు

జవాబు



ఈ
ఫోటో
లో
ఉన్నది
మీనా

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

ఫోన్ నెం:9390044031

ఎంత చెప్పినా...కొట్టినా చదవడే...

మా బాబు 9వ తరగతి చదువుతున్నాడు. నేను ఎంత చెప్పినా సరిగ్గా చదవడం లేదు. నేను ఉద్యోగం చేసి వచ్చి వాడితో వేగలేకపోతున్నాను. ఒక్కోసారి కోపంతో కొడుతున్నాను. అయినా వినడం లేదు. పరిష్కారం చెప్పగలరు!

- కవిత, తిరుపతి.

తల్లిదండ్రుల గొంతెమ్మ కోరికలకు, విద్యాసంస్థల వ్యాపార దాహం సృష్టించే ఒత్తిడికి మధ్య పిల్లలు మానసికంగా నలిగిపోతున్నారు. తల్లిదండ్రులు ఉండి కూడా విద్యార్థులు మానసికంగా అనాథలుగానే జీవిస్తున్నారు. 10 నుండి 15 గంటల పాటు పాఠశాలలో ఉండి ఇంటికొచ్చిన పిల్లలతో తల్లిదండ్రులు ట్యూషన్ టీచర్లలా వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రులు ప్రేమతో, అభిమానంతో మాట్లాడటం మరిచిపోయి వాళ్ళు చదివిన విషయాల గురించి రావాల్సిన మార్కుల గురించి చర్చిస్తూ మాతృ, పితృ వాత్సల్యానికి పిల్లలను దూరం చేస్తున్నారు. దానితో పిల్లలు తల్లిదండ్రులు చెప్పిన మాట వినడంలేదు. మీ బాబులో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం, ప్రోత్సహించడం చెయ్యండి. టీచర్లు, విద్యార్థుల మధ్య సరైన అనుసంధానం ఏర్పడకపోవడం వల్ల కూడా పిల్లలు చదువులో వెనుకబడుతున్నారు. దీనిని గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోండి. మీ బాబుని ప్రతికూల వ్యాఖ్యలతో కించపరచడం, నిరుత్సాహపరచడం చేయకండి. తన సామర్థ్యాలను గుర్తించి వినియోగించుకొనే విధంగా ప్రోత్సహించండి. జనరల్, స్నేహితులు, ఆటలు వంటి విషయాల గురించి ఎక్కువగా మాట్లాడండి. మీరు దగ్గర కూర్చొని చదివించండి. ఓపికతో చెప్పండి. మీ ప్రోత్సాహమే బాగా చదివేలా చేస్తుంది.

నామీద నాకే అపనమ్మకం

నేను ఇంజనీరింగ్ చేశాను. నేను చిన్నప్పటినుండి గారాబంగా పెరిగాను. ఏ పనీ చేతకాదు. దానితో నేను ఉద్యోగం చెయ్యలేననే అపనమ్మకం పెరిగిపోయి ఇంటర్వ్యూలకు కూడా వెళ్లడంలేదు. నా స్నేహితులంతా మంచి ఉద్యోగాలలో సెటిల్ అయ్యారు. ప్రతి రోజు ఏడుస్తున్నాను. ఏం చెయ్యాలో సలహా చెప్పగలరు.

- సుబ్బారెడ్డి, కడప.

ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఒక వ్యక్తి ఏదైనా సాధించగలిగితే... దానిని మనిషైన వారెవరైనా సరే సాధించగలరు. మనిషి ఒక కంప్యూటర్ అయితే... మెదడొక హార్డ్‌వేర్... దానిలో నిక్షిప్తమై ఉన్న విజ్ఞానమే సాఫ్ట్‌వేర్. చూడటం, వినడం, అనుభూతి, స్పర్శ, రుచి, వాసన మొదలగు పంచేంద్రియాల ద్వారానే మెదడులో సాఫ్ట్‌వేర్ రూపొందుతుంది. మీ సాఫ్ట్‌వేర్‌లోకి 'నాకు రాదు. నేను చెయ్యలేను' అని నెగిటివ్ అంశాలను పంపించారు.ఆ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్ పాజిటివ్‌గా ఉంటే విజేతలవుతారు. ఆ సాఫ్ట్‌వేర్‌లోని నెగిటివ్ అంశాలను తొలగించి పాజిటివ్ అంశాలను పునఃప్రతిష్ఠించాలంటే పంచేంద్రియాలు ప్రేరణతో కూడిన ఊహాత్మక స్థితి ద్వారా సాధ్యమవుతుంది. హిప్నసిస్ టెక్నిక్స్‌ని రోజూ ప్రాక్టీసు చెయ్యండి. అవసరమైతే కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌ను కలవండి.

అమ్మకో తోడు అందిస్తే....

నేను అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాను. మా నాన్నగారు నా చిన్నతనంలోనే చనిపోయారు. నా తల్లి నన్ను పెంచి ఇంతటి వాణ్ణి చేసింది. నేను పెళ్ళి చేసుకుని అమెరికాలో ఆనందంగానే ఉంటున్నాను. కానీ అమ్మ ఒంటరిగా ఉండడం బాధగా ఉంది. ఆమెకు పెళ్లి చేసి ఒక తోడు ఇవ్వాలనుకుంటున్నాను. అది సమంజసమేనా! సలహా ఇవ్వగలరు.

- రాజేష్, నెల్లూరు.

మీ ఆలోచన మంచిదే! ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది వృద్ధులు ఒంటరితనంతో బాధపడుతూ మానసిక సమస్యలకు లోనవుతున్నారు. మీరు ఫోన్‌లో మీ అమ్మగారితో మాట్లాడగలరు కానీ ఆమెను దగ్గరుండి చూసుకోలేరు. మన సంస్కృతిని బట్టి పెద్దలు తొందరగా ఒప్పుకోలేరు. కాబట్టి మీ అమ్మగారితో సంప్రదించి ఆవిడ ఒప్పుకుంటే అప్పుడు ఆలోచించండి. చేసే వ్యక్తి మంచి ప్రవర్తన కలిగినవాడై ఉండాలి. పెళ్లి తర్వాత సమస్యలు లేకుండా ఒకటికి నాలుగుసార్లు ఆలోచించి చెయ్యండి. ఆల్ ది బెస్ట్.

ప్రపంచాన్ని మార్చాలనుంది

నేను ఇంటర్ ఫెయిల్ అయ్యాను. నేను ఈ ప్రపంచాన్ని మార్చేద్దామనుకుంటున్నాను. నేను ఏమి చేస్తున్నా మా ఇంట్లో అందరూ 'ముందు చదువు. తర్వాత ప్రపంచాన్ని మారుద్దువుగానీ' అంటూ తిడుతున్నారు. దానితో నేను ఏమీ చేయలేకపోతున్నాను. సలహా ఇవ్వగలరు.

- మధు, గుంటూరు.

మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మీరే కాదు ఎవ్వరూ మార్చలేరు. మీరు మారితే మీ చుట్టూ అనేక మార్పులు మీకు గోచరిస్తాయి. ఇక్కడ మారాల్సింది మీ దృక్పథం, మీ ఆలోచనా విధానం. ముందు ఇంటర్ పాస్ అయ్యి, డిగ్రీ, పిజి చేసి ఉద్యోగం సంపాదించండి. మీలో వస్తున్న మార్పులే ఈ ప్రపంచం కొత్తదిగా కన్పించేలా చేస్తాయి. మీ పెద్ద వారు చెప్పినట్లుగా చదువుకుంటూ కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటూ కొత్తగా ఉపయోగపడే పనులు చేస్తూ ఉంటే మార్పు దానంతట అదే వస్తుంది. ఆల్ ద బెస్ట్.

*



లోకొరి లోకొరిలో...

డా॥ జె.పి. వైద్య

అద్భుతమైన పోరాట సన్నివేశాలు, అంతే పనితనం చూయించిన కెమెరా సిద్ధహస్తం, చక్కటి స్వంత ఎడిటింగ్ వల్ల అకిరా పడ్డ కష్టం సార్థకమైంది. కాసుల వర్షంతో పాటు, యావత్ ప్రపంచంలో సినీ వర్గంలో ఆయనకు ఎనలేని పేరు ప్రతిష్ఠలు సంపాదించి పెట్టింది -'సెవెన్ సమురై'. ఆయన చిత్ర నిర్మాణంలో సిద్ధహస్తుడే కాక, సన్నివేశాలు రక్తికట్టించిన మంత్రగాడూ, ఇంద్రజాలికుడూ అని ప్రశంసలు పొందాడు. షేక్స్పియర్ 'మెక్బెత్' ఆధారంగా 'కుమో నో సు- జో' (త్రాన్ ఆఫ్ బ్లడ్) 1957లో నిర్మించారాయన. అందులో మంచులో చిత్రీకరించిన సన్నివేశాలు మళ్లీ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశాలయ్యాయి.

జపాన్ ఆశాకిరణం అకిరా కురుసోవా!

శామ్యూల్ జాన్సన్ ఒక చోట రాసుకున్నాడు -"ఒక కార్యం యొక్క నైతికత అది నిర్వహించబడిన ఉద్దేశ్యంపై ఆధారపడి ఉంటుంది" అని. ప్రేరణ అనేది జీవితానికి ఎంతో అవసరం. అది లేని మనిషికి జీవితం చీకటి కోణాలుగా భాసిస్తుంది.

మన దేశంలో అపూర్వమైన ప్రజ్ఞాపాటవాలున్న అతి విశిష్ట వ్యక్తులున్నారు. బెంగాలీ సినీ విశ్వంలో 'విశ్వరూప ప్రదర్శన' చేసిన సత్యజిత్ రే..., తెలుగువారి గుండె సవ్వడి - గీతల జాదూగర్ - బాపు రమణీయ సృష్టికి ముందుగా పకడ్బందీగా 'స్క్రిప్ట్' తయారు చేసుకునేవారు. భారతీయ సినీ విశ్వంలో వారిద్దరికీ ఒక ప్రత్యేకత ఉంది.

ప్రతి ఫ్రేము ముందే చిత్ర రూపంగా తయారై ఉంటుంది. అందుకే వారిది ప్రత్యేకమైన శైలి.

"చలన చిత్రాలను మేమే కనుక్కున్నాం తెలుసా?" అని ఎలుగెత్తి ఆర్భాటంగా గోల చేసే కొందరు పాశ్చత్య వాదులకు 'మేమూ ఉన్నాం బాబూ! మమ్మల్ని తక్కువగా అంచనా వేయకండి...' అని ధాటిగానూ, ధీటుగానూ జవాబు ఇచ్చిన 'జపాను సినీ ప్రముఖుడు' - 'అకిరా కురుసోవా'! ప్రతీ పనికి జబ్బలు చరుచుకునే 'హాలీవుడ్' పెద్దోళ్లు సైతం ఆయన చిత్రాల్లోని సాంకేతిక పరిజ్ఞానానికి తల వంచాల్సి వచ్చింది. ఆయన ఆస్కార్ అవార్డ్సు సొంతం చేసుకున్నారు.

1990లో ఆయనను 'గౌరవ ఆస్కార్‌తో సన్మానించారు.

అకిరా కురుసోవా పూర్వజులు 'సమురై' (యోధుల) వంశానికి చెందిన జపాన్ వాళ్లు.

తల్లి 'షిమా', తండ్రి 'ఇసాము కురుసోవా'!

వారికి ఎనమండుగురు పిల్లలు. "అకిరా కురుసోవా" ఆఖరు సంతానం. అతనికి ముగ్గురు అన్నలు, నలుగురు అక్కలు.

టోక్యోలోని 'ఒటా' లో మార్చి 23, 1910లో అకిరా జన్మించినప్పుడు వారి తల్లి వయస్సు 40 సంవత్సరాలు. తండ్రి 45 సంవత్సరాలు దాటాడు. ఆయన జపాన్ మిలిటరీ ఆధ్వర్యంలో నడిచే ఒక ఉన్నత పాఠశాలలో డైరెక్టర్. యుద్ధ విద్యల్లో కడు నేర్పరి. పిల్లలకూ నేర్పాడు. అందువల్లే చిన్నారి 'అకిరా'కు 'సమురై' లంటే తగని ప్రీతి. అభిమానం. ప్రాథమిక విద్యనభ్యసించే తరుణంలో అకిరా తన తెలివితేటలతో గిరిజనుల అభిమానం చూరగొన్నాడు. వారి ప్రోత్సాహం దోసిళ్లకొద్దీ పొందాడు. చిత్రలేఖనంలో మంచి పట్టు లభించింది. సినీ దర్శకుడిగా అవతారం ఎత్తాక చిత్రలేఖనం ఎంతో అక్కరకొచ్చింది. తన సినీ పాత్రల రూపకల్పన తానే స్వయంగా చూసుకొనేవాడు. చిన్నతనంలో అన్నయ్యలతో పాటు నాటకాల్లోనూ నటించాడు.

23 సంవత్సరాల వయస్సులోనే కష్టాలు ఒకదానివెంట మరొకటి వచ్చి తరమ సాగాయి. అన్నలు అనారోగ్య వంతులయ్యారు. ఒక అన్న ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆఖర్న ఇసాము వారసుడిగా అకిరా ఒక్కడే మిగిలాడు. జపాన్‌లోని పి.సి.ఎల్ స్టూడియోలో సినీ జీవితం ప్రారంభమైంది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా స్థిరపడిపోయాడు. ఎన్నో కళాఖండాలు తెరమీద వెలిగాయి. పి.సి.ఎల్ స్టూడియో కాలక్రమేణా 'టోహో'గా మార్పు చెందింది. ఆ రోజుల్లో 'కజిరో యమ మోటో' ఎంతో పేరున్న దర్శకుడు. ఆయన దగ్గర సహాయ దర్శకుడిగా పని చేసిన అకిరా 1943లో తన స్వంత తొలి చిత్రం 'సన్షిరో సుగాతా' నిర్మించాడు. చిత్రం నిండా జపనీయుల జూడో పోరాట పటిమల ముచ్చట్లే! అది ఆ రోజుల్లో పాశ్చత్య సినీ విశ్వంలో 'విశ్వరూపం' చూయించిన 'బాక్సింగ్'కు జవాబు అన్నమాట!

జాన్ ఫోర్డ్ లాంటి పాశ్చాత్య దర్శకుల నుండి స్ఫూర్తి పొంది తమ జపాన్ సంస్కృతి సాంప్రదాయాలనూ అకిరా చిత్రీకరించి చర్చితుడయ్యాడు.

పాశ్చాత్య దర్శకులను సైతం ప్రభావితం చేసిన అకిరా చిత్రఖండం 'సిచినిన్ నో సమురై'.... 1954 లో వచ్చిన 'సెవెన్ సమురై' చిత్రం ఇదే! ప్రపంచ సినీ సృష్టిలో కలకలం సృష్టించిన అపూర్వ సృష్టి అది. టూకీగా కథ ఇలా సాగుతుంది.

-"బందిపోటు దొంగలు గ్రామాలను దోచుకుంటారు. తమ ఆస్తిపాస్తులతో పాటు భార్యాపిల్లలను సైతం పోగొట్టుకున్న గ్రామస్తులు ఏడుగురు సమురై వీరులను ఆశ్రయిస్తారు. వారు తమ ప్రాణాలను పణంగా పెట్టి వారికి బందిపోటుల బెడద లేకుండా చేస్తారు".

మన మహాభారతంలోనూ అలాంటి వీర గాథలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. రాక్షసుల బారినుండి దేవలోకాన్ని కాపాడి అర్జునుడు యుద్ధంచేసి విజయ యాత్రను సాధిస్తాడు. అలాంటి కథలే నా చిత్ర నిర్మాణానికి స్ఫూర్తి అని స్వయంగా అకిరా ఒకచోట వక్కాణించాడు. బందిపోటు తరహా సినిమాలు హాలీవుడ్,

బాలీవుడ్, టాలీవుడ్‌లోనూ వచ్చాయి. మనం 'ఓహో! ఆహా!' అంటూ ఎగిరెగిరి ఆదరించిన వాళ్లమే!

మూడున్నర గంటలసేపు సాగిన 'సెవెన్ సమురై' ఎక్కడా ప్రేక్షకులకు విసుగు కల్గించదు.

అద్భుతమైన పోరాట సన్నివేశాలు, అంతే పనితనం చూయించిన కెమెరా సిద్ధహస్తం, చక్కటి స్వంత ఎడిటింగ్ వల్ల అకిరా పడ్డ కష్టం సార్థకమైంది. కాసుల వర్షంతో పాటు, యావత్ ప్రపంచ సినీ వర్గంలో ఆయనకు ఎనలేని పేరు ప్రతిష్ఠలు సంపాదించి పెట్టింది -'సెవెన్ సమురై'.

ఆయన చిత్ర నిర్మాణంలో సిద్ధహస్తుడే కాక, సన్నివేశాలు రక్తికట్టించిన మంత్రగాడూ, ఇంద్రజాలికుడూ అని ప్రశంసలు పొందాడు.

షేక్స్పియర్ 'మెక్బెత్' ఆధారంగా 'కుమో నో సు- జో' (త్రాన్ ఆఫ్ బ్లడ్) 1957లో నిర్మించారాయన. అందులో మంచులో చిత్రీకరించిన సన్నివేశాలు మళ్లీ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశాలయ్యాయి. అడవిలో గుర్రాలపై నాయకుడి విన్యాసాలు, పతాక సన్నివేశాల్లో హీరోపై సాగే అమ్ముల వర్షం నేటికీ ప్రేక్షకులను విస్మయాశ్చర్యాల్లో నింపి పారేసి, చకితులను చేస్తాయి.

మన దేశపు మొగల్-ఏ-ఆజమ్ నిర్మాత కె. ఆసిఫ్, గ్రేటెస్ట్ షో మ్యాన్ 'రాజ్ కపూర్', ఖల్‌నాయక్ నిర్మాత 'సుభాష్ ఘై' , పాకీజా నిర్మాత 'కమాల్ అమ్‌రోహీ', మదరిండియా మెహబూబ్ ఖాన్‌లాగే అకిరా కురుసోవా చిత్రాల్లో భారీతనం నిండిఉంటుంది.

అదే తర్వాతి రోజుల్లో ఆయన పాలిట శాపంగా మారింది కూడా! జపాన్‌లో అంత భారీగా పెట్టుబడి పెట్టేవారు కరువయ్యారు.

స్వతహాగా చిత్రకారుడు అయినందువల్ల 'అకిరా' తన చిత్రాల్లో అరుదైన ప్రత్యేకతలను సమకూర్చి 'ఆల్‌టైమ్ గ్రేట్' గా మలచగలిగాడు. ప్రతి ఫ్రేమ్ ను అందంగా చిత్రీకరించగలిగాడు. టెలీ లెన్స్‌ను ఉపయోగించి 'వైడ్ యాంగిల్స్'లో చిత్రీకరించడం ఆయన ప్రతిభకు తార్కాణం. కథకు అవసరం అనుకున్న చోట్ల 'వైప్ షాట్ల' ప్రయోగం సినీ ప్రేక్షకులను అబ్బురపరిచాయి, ఆశ్చర్యపరిచాయి. ఆనందపరిచాయి.

'ది మోస్ట్ బ్యూటిఫుల్' (1944) - 'సన్షిరో సుగాతా-2'(1945) - 'అసు ఓ త్సుకురా హిటోబిటో'(1946) - 'బాగా షె షెన్ ను కినాషి'(1946) - 'సుబరషికి నిచియోబి'(1947) - 'యోదేరే టెన్షీ'(1948) - 'షిజుకనరు కెట్టో'(1949) - 'నోరా ఇను'(1949) - 'షుబున్'(1950) - 'రషోమన్'(1950)... ఇవన్నీ ఆయన చిత్రాల్లో కొన్ని.

'రషోమన్' ఆస్కార్ అవార్డ్ చేజిక్కించుకుని విదేశీ సినీ పెద్దోళ్లను ఉలిక్కి పడేలా చేసింది.

'సర్క్యులర్ స్క్రీన్ ప్లే' విధానంలో సినీ కథా కథనం సాగుతుంది. టూకీగా కథ ఇలా ఉంటుంది. - "ఒక సమురై కొత్తగా పెళ్లి చేసుకుని నవ వధువుతో అడవిలో ప్రయాణం సాగిస్తుంటాడు. ఆ సమురైను ఒక దొంగ అడ్డగిస్తాడు. అతడి భార్యమీద అత్యాచారం చేస్తాడు. ఆ ముగ్గురు వారివారి కోణాల్లో కథను వెండితెరమీద చెప్తారు". అదే దాని ప్రత్యేకత.

మన దేశంలోనూ ప్రతిభావంతులకు కొరత లేదు. మణిరత్నంగారి 'యువ', కమల్ హాసన్ 'పోతురాజు' ఇలాగే సాగిన చిత్రకథలు.

ఆ తర్వాత ఆయన చిత్రం 'ఇకిరు'(1952)లో వచ్చింది. మళ్లీ పాశ్చాత్య దేశాల 'పెద్దోళ్ల' మనసుల్లో కలకలం రేపింది.

అప్పటినుంచి 'అకిరో కురుసోవా' చిత్రం ఎప్పుడొస్తుందా? అని యావత్ ప్రపంచ సినీ రసికులు ఎదురు చూసేవారు.

ఆరోజుల్లో రాజ్ కపూర్ , వి. శాంతారాం సినిమాలకూ, ఈ తరంలో రాంగోపాల్ వర్మ సినిమాలకూ కళ్లు పెద్దవి చేస్తూ ఎదురు చూడటం మనకు తెలిసిన విషయమే!

సినిమా లోకం. సినిమా పిచ్చి అలాంటిది మరి! ఏం చేస్తాం?

కాలాంతరంగా భారీ చిత్ర నిర్మాణానికి కావాల్సిన హంగులూ, ఛంగులూ, పెట్టుబడులూ కొరవడ్డాయి. 1974లో రష్యా వారి పెట్టుబడితో 'దెర్సు ఉజాలా' నిర్మాణం జరిగింది. ఫోర్డ్ కొప్పోలా, జార్జ్ లూకాస్ పెట్టుబడులతో 'కగేముషా'(1980)లో రూపుదిద్దుకుంది. 'కింగ్ లియర్' నాటకం ఆధారంగా 1985లో 'ర్యాన్' రంగులద్దుకొని మరీ వచ్చింది.



మన మహాభారతంలోనూ అలాంటి వీర గాథలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. రాక్షసుల బారినుండి దేవలోకాన్ని కాపాడి అర్జునుడు యుద్ధంచేసి విజయ యాత్రను సాధిస్తాడు. అలాంటి కథలే నా చిత్ర నిర్మాణానికి స్ఫూర్తి

ఆయన నిర్మించిన 16 చిత్రాల్లో 'తోషిరో మిఫ్యూన్' నటించాడు. 'రెడ్ బియర్డ్'(1965) పరాజయం 'అకిరో'ను తీవ్రంగా కదిలించింది. అదే దశలో ఆయన ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశాడు. కానీ అభిమానులు బ్రతికించుకున్నారు. బహుశా వారి ప్రేమకు పులకించిపోయి తర్వాతి రోజుల్లో 'ఆస్కార్' అవార్డును సొంతం చేసుకునేంత రగిలి పోయేలా అకిరా ఎదిగారేమో!

మన దేశంలో ఇలాంటి వింతలూ, విడ్డూరాలూ జరిగాయి.

దాదాపు తన జీవిత చరిత్రగా, కలల పంటగా 'మేరా నామ్ జోకర్' నిర్మించిన రాజ్‌కపూర్ అంతటివాడు- చిత్రం బక్సాఫీస్ దగ్గర బోల్తా పడేసరికి ఆవేదనతో ముందు మత్తులో తూలిపోయాడు.

బన్నీ రూబెన్, అబ్బాస్, మనలాంటి 'వీరాభిమానులం' ఊరుకుంటామా? ఆ తర్వాత మనకోసం ఆ నీలికళ్ల ఇంద్ర జాలికుడే 'బాబీ' నిర్మించలేదూ? 'మై షాయర్ తో నహీ?' అని కవులు కాని మనం పాడుకోలేదూ? 'హమ్ తుమ్ ఏక్ కమ్‌రే మే బంద్‌హోఁ' అని 'కమరా-చాబీ-బాబీ' లేకున్నా పాడుకుంటూ హడావుడి చేయలేదూ?

దురదృష్టం వెంటాడింది. 'కాగజ్ కే ఫూల్' లాంటి మాస్టర్ పీస్ నిర్మాత 'గురుదత్' అకాల మృత్యువుకు మనం కృంగి పోలేదూ? కానీ, మనం ఆశా జీవులం!

లేచి మళ్లీ సినిమా షోల కిటికీల వైపు పరుగెత్తే హుషారుగాళ్లం కదామరి! తన సినిమాలకు భావితరం పాఠ్యగ్రంథాల్లాంటి గుర్తింపు పొందిన 'అకిరా కురుసోవా' టోక్యోలో 88వ ఏట సెప్టెంబర్6- 1998లో తనువు చాలించాడు.

'అకిరా' అభిమానులు మన దేశంలోనూ కోకొల్లలుగా ఉన్నారు. తెలుగువారి యువ హీరో 'చిరంజీవి' తమ్ములుంగారు ఏకంగా తన అబ్బాయికి 'అకిరా' అని నామకరణం చేశారని విన్నాం మనం. అయినా, మనం వారి సినిమాల కోసం పడిచచ్చే 'దీవానా'లం! మనలాంటి 'దీవానా'లను ఇంటికి పిలిచే ప్రముఖులు ఉంటారా ఏమి? మనం 'సమురై'లా కొత్త సినిమా వేటలోనే ఖుష్! ఎవరి పిచ్చి వారిది!

హాయిగా చదువుకొనే 'చంద్రహాసం"

"చంద్రహాసం" నవ్వుల దిక్సూచి. ఈ కథలన్నీ 'జన సందేశ్' పత్రికలో రాసిన కాలమ్స్. కాసేపు సిద్ధాంతాలను పక్కన పెట్టి - మనిషికీ, మనిషికీ మధ్య అనుబంధాలు... "మార్కెట్లోకి" వెళ్లాక ఎందుకు పుటుక్కున తెగిపోతున్నాయో చాలా కథల్లో రచయిత సామాన్య పాఠకునికి "అర్థం" అయ్యేలా రాశారు. వ్యంగ్య రచయితగా ప్రచురణకర్తలు సతీష్‌చందర్‌ను పేర్కొన్నారు. కానీ మనిషి- మానవత్వం - దయ - కరుణ - ప్రేమ - తోటి వారిపై సానుభూతి చూపే గుణం - ఇలా ఎన్నో అంశాల్ని కేవలం 2 పేజీల్లో కథాగమనంగా గుండెల్ని స్పృశించి, మెదళ్లకు పదును పెట్టారు కవి. 73 కథల్లో పైఅంశాల్ని అంతస్సూత్రంగా మలచారు. డబ్బే సర్వస్వంగా చెలామణి అయ్యే నేటి ప్రపంచీకరణ, అమెరికన్ మార్కెట్ ఎకానమీ 'మాయా' జాలంలో పల్లెసీమల మట్టి పరిమళాలు, గ్రామీణ రైతాంగ ప్రజల స్వచ్ఛత, సహ జీవన సౌందర్యం, సౌఖ్యం నేటి యువతకు తెలియవు. కాల్ సెంటర్లలో, హైటెక్, ఐ.టి ఉద్యోగాల్లో లక్షల్లో ఆస్తులు కూడబెట్టు'కొనే' వారికేం తెలుస్తాయి మానవత్వం విలువలు. 'డబ్బు' జబ్బు పట్టిన యువత సైతం - చంద్రహాసం అధ్యయనం చేస్తే పునరాలోచన పొందుతారు.... తాము ఏం కోల్పోతున్నామో తెల్సుకొంటారు. దాదాపు 73 కథలు.... (అన్నీ మినీ కథలే) 256 పేజీల్లో ప్రచురించారు. అన్ని కథలూ... పాఠకున్ని ఏకబిగువున ఒక్కసారిగా చదివిస్తాయి. ఈ పుస్తకంలోని తొలి కథ "తోడు ప్రేమ కొడుకు" (పేజీ9) నగరీకరణను, పల్లె జీవన వికాసాన్ని చక్కగా అక్షరీకరించారు. "నా ఊరు మర్రి చెట్టును తెచ్చి కుండీలో పెట్టుకుంటానా!?" అంటూ కథ ముగిస్తారు. "రాంపండు" లాంటి వ్యక్తులు మనసున్న ప్రతి వారికీ కావాలి, రావాలి. బాల్యాన్ని ఎవరికి వారే గుర్తుకు తెచ్చుకొనేలా చేస్తాయి ఈ కథలో. "సెంటుమెంటు" కథ. "గల్ఫ్‌లో నువ్వు పోగొట్టుకున్న ఉద్యోగం పేరేమిటి?" అనడిగా... "కార్లు కడగటం" అన్నాడు(పేజీ14) పండగలూ, "భర్త"డేలూ(పేజీ44) కథలో పూర్వం



జరుపుకునే ఊరుమ్మడి పండుగలు -తగలేసుకోడానికి ఇప్పటి సొంత పండుగలు దండుకోడానికి...(పేజీ46)అంటారు రచయిత. 'రాత'లు మారే రోజులు... కథలో తాత మనుమడు సంభాషణను వ్యంగ్యంగా చిత్రించారు. వాళ్ల రాతలు "మనం మార్చలేం. కంప్యూటర్లే మార్చాలి" (పేజీ49) అంటారు కవి. ఈ దేశంలో కంప్యూటర్, క్రికెట్, ఆంగ్లం, షేర్ మార్కెట్... పిచ్చి అన్ని వయస్సుల వారిలో వ్యాధిలా ప్రబలింది. మన భారతీయ జీవన శైలి అదృశ్యం ఐంది. ఈ అంశాల్ని దాదాపు ప్రతి కథలో చెప్పి మానవత్వం మనిషి కేంద్రంగా ఉండాలి అనే సత్యాన్ని గ్రామ సీమల గొప్పతనాన్ని, అందరికీ అర్థమయ్యేలా ఈ "అనురాగ కథల్ని" సృష్టించిన సతీష్ చందర్ అభినందనీయులు. నవ్వలేని వార్ని కూడా చాలా కథలు నవ్వింప జేస్తాయి. కీర్తి, కాంత, కనకం(డబ్బు) పై వ్యామోహం గలవార్ని "మా 'చెడ్డ' వ్యసనం" కథ ద్వారా మన ముందు నిలబెడతారు రచయిత. 'ఆలస్యం 'అప్పనం "విషయం" (పేజీ211) లాంటి కథలు ఆలోచింపచేస్తాయి. సమాజాన్ని అవలోకింప చేస్తాయి. పిల్లలకు మోరల్ వాల్యూస్ కోసం కొన్ని కథలు పనికి వస్తాయి. మంచి ప్రయత్నం ఈ సంపుటి.

సతీష్ చందర్ -"అనురాగ కథలు",
పేజీలు : 256,
వెల : 90/-,
ప్రతులకు : ఎ.పి. కాలేజ్ ఆఫ్ జర్నలిజం,
3-6-712/2/3, స్ట్రీట్ నెం.11,
హిమాయత్ నగర్
హైదరాబాద్.

-తంగిరాల చక్రవర్తి



పూల రేకులు
(నానీలు)
కోపూరి పుష్పాదేవి
వెల: 20/-,
పేజీలు : 32
ప్రతులకు :
కె. రామచంద్రరావు
6-12-16,
జయరాం స్ట్రీట్,
తెనార్ పేట, కె.టి.రోడ్,
విజయవాడ.



సాహిత్య వ్యాసాలు
జయంతి పాపారావు
వెల: 80/-
పేజీలు: 107
ప్రతులకు:
జయంతి పాపారావు
39-7-41/3,
మురళీ నగర్,
విశాఖపట్నం
530007.



గుమ్మడిపండు పడవల పోటీ

విండ్సర్‌లో ప్రతి ఏటా ఈ పోటీ జరుగుతుంది (దానికో కారణం వుందిలెండి. అక్కడ గుమ్మడికాయలు బాగా పండుతాయి). ఇందుకోసం భారీ గుమ్మడిపండ్లను ఇలా పడవలుగా తొలుస్తారు. రకరకాల రంగులు, డిజైన్లు వేసి వాటిని అలంకరిస్తారు. పోటీలో పాల్గొనాలనుకున్నవారు ఇలా ఒక గుమ్మడిపండు పడవ, తెడ్డు తీసుకొని పెసాక్విడ్ నదిలోకి దిగుతారు. చెమటలు కక్కేలా తెడ్లు వేసుకుంటూ గుమ్మడికాయ పడవలను ముందుకు తీసుకెళతారు. కూసింత కష్టమే అయినా ... ప్రతి సంవత్సరం అక్టోబర్ మాసంలో జరిగే ఈ పోటీలను వీక్షించడానికి సందర్శకులు మాత్రం పెద్దసంఖ్యలోనే విచ్చేస్తారు. ఇదిగో ఈ ఏడాది జరిగిన పోటీల్లో యాబై మంది పాల్గొంటే వెయ్యి మంది వచ్చారు చూడ్డానికి. మరి పోటీలో పాల్గొనేవారిని తమ ఈలలు, చప్పట్లు, కేరింతలు, అరుపులు ద్వారా...బాగా ప్రోత్సహించాలిగా. గుమ్మడికాయ పడవ పోటీలకు మాంచి గిరాకీనే వుందంటరా!

టిమున్ తెలివి

ఇండొనేషియా అని మన ఇండియాలాగా ఒక దేశం వుంది. అక్కడి కథ ఇది. చాలా...చాలా...రోజుల క్రితం అక్కడ ఓ రైతు వుండేవాడు. అతను, అతని భార్య పొలంలో ఎంతో కష్టపడి పనిచేసేవారు. ఆదాయం వరవాలేదు. ఈతిబాధలు లేకుండా ఇల్లు గడిచేది. కాకపోతే వారికి ఒక్కటే లోటు. ఇంట్లో అల్లరి చేసే...కేరింతలు కొట్టే ... పిల్లలు లేరు అన్నదే వారి దిగులు. అందరిలాగా తమకూ ఒక నలుసు పుడితే ఈ జన్మకు చాలుకదా అనుకునేవారు. కనిపించిన చెట్టు... పుట్టను సైతం మొక్కి అదే వేడుకునేవారు. ఓసారి ఇంట్లో ఇద్దరూ కూర్చుని ఈ విషయమే చర్చించుకుంటుండగా.. అటుగా వెళ్తున్న రాక్షసుడి చెవిన పడ్డాయా మాటలు. వాడు వారిని పిల్చి...

"మీకు పిల్లలు లేరని దిగులు చెందకండి. నేను చెప్పినట్టు చేస్తే పండంటి పాప మీకు లభిస్తుంది.కాకపోతే ఒక షరతు... ఆ పాపకు పదిహేడేళ్ల వయసు రాగానే నేను వస్తాను. ఆమెను నాకు అప్పగించాలి. అందుకు అంగీకారమైతే చెప్పండి" అన్నాడు.

పిల్లలకోసం పరితపిస్తున్న దంపతులు ఆ షరతుకు అంగీకరించారు. రాక్షసుడు తన మొలకు కట్టిన సంచిలోంచి కొన్ని దోస గింజలు తీసిచ్చాడు. వాటిని నాటారు దంపతులు. ప్రతిరోజూ పాదులో నీళ్లు పోస్తూ జాగ్రత్తగా కాపాడుకోసాగారు. మొక్క మొలిచి పెద్దదై దోసకాయలు వచ్చాయి. అందులో ఒక దోసకాయ బంగారు రంగులో బాగా పెద్దగా అయ్యింది. దోరగా అయ్యాక దాన్ని చెట్టునుంచి కోశారు. రైతు జాగ్రత్తగా దాన్ని మధ్యకు కోసి చూశాడు. అంతే ... చిరునవ్వులు చిందిస్తున్న పాప కనిపించింది. భార్యాభర్తల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. తమ కల నిజమైనందుకు ఎంతగానో సంతోషించారు. పాపకు టిమున్ మాస్ అని పేరు పెట్టుకుని అల్లారు ముద్దుగా పెంచుకోసాగారు. చూస్తుండగానే పాప ఎదగసాగింది. పదిహేడవ ఏడు కూడా వచ్చేసింది. అలా సంతోషంగా రోజులు గడుస్తుండగా ఓరోజు రాక్షసుడు రానే వచ్చాడు. అతగాణ్ణి చూసేవరకూ తాము అతనికిచ్చిన మాటే గుర్తురాలేదు వారికి. దాంతో వారిరువురి మొహాలు ఒక్కసారిగా నల్లగా మాడిపోయాయి. అయినా తప్పదు కదా. పాపను ఇవ్వడానికే సిద్ధమయ్యారు. అయితే ఒక బుట్టలో కొద్దిగా మిరపకాయలు, ఉప్పు, రొయ్యల పొట్టు, దోసకాయ గింజలు వేసి పాపకు ఇచ్చి...

"చిట్టి తల్లీ... టిమున్! నీకు ఇవి కష్టకాలంలో సాయం చేస్తాయి. నువ్వు వెంటనే ఇక్కడి నుంచి వేగంగా పరుగెత్తుకుంటూ వెళ్లు. ఆ రాక్షసుడి బారినుంచి నిన్ను నువ్వు కాపాడుకో..." అని చెప్పారు.

అంతే ఆమె విల్లు నుంచి వదిలిన బాణంలా దూసుకుపోసాగింది. రాక్షసుడు మాత్రం తక్కువ తిన్నాడా! టిమున్‌ను వదలకుండా వెంటపడి పట్టుకోవడానికి ప్రయత్నించసాగాడు. అయితే రాక్షస బలం ముందు మానవశక్తి ఎంత?! తాను రాక్షసుడి చేతికి చిక్కుతాననగా...టిమున్‌కు అమ్మానాన్నా చెప్పిన మాటలు గుర్తొచ్చి...బుట్టలోంచి ఉప్పు తీసి తన వెనక చల్లింది. అంతే... ఆ ఉప్పు నీరుగా మారి ఊట పెద్దగా అయ్యి సముద్రంలా అయ్యింది. మొదట కాస్త ఇబ్బందిపడ్డా... రాక్షసుడు పట్టు వదలకుండా వెంటపడసాగాడు. మరోసారి కూడా దాదాపు టిమున్‌ను పట్టుకున్నంత పని చేశాడు. సరిగ్గా అప్పుడు ఆమె బుట్టలోంచి ఎండుమిరపకాయలు తీసి తన వెనుక చల్లింది. వాటి నుంచి మొక్కలు మొలిచి... పెద్ద పెద్ద చెట్లయి ...రాక్షసుడి కాళ్లను పెనవేసుకున్నాయి. అయినా వాడు లెక్కచేయక వాటిని తెంచుకుని ముందుకు రాసాగాడు. అలా టిమున్‌ను వెంబడించసాగాడు. ముచ్చటగా మూడోసారి కూడా టిమున్‌ను అందుకోబోయాడు. అప్పుడు ఆమె దోసగింజలు తీసి తన వెనుక చల్లింది. వాటి నుంచి దోస మొక్కలు మొలిచి...పెద్దవై విపరీతమైన కాపు కాసింగి. ఆ దోసకాయలను చూసిన రాక్షసుడికి బాగా ఆకలైంది. వెంటనే వాటిని కోసుకొని కడుపారా తిన్నాడు. దాంతో వాడికి ఒక్కసారిగా నిద్ర ముంచుకొచ్చింది. అలా పడుకుండిపోయాడు చాలాసేపు. కానీ మళ్లీ లేచి టిమున్ వెంట పడసాగాడు. పరుగుతీసీ... పరుగుతీసీ... అలసిపోయిన చిన్నారి టిమున్ కాస్త నిదానంగా నడుస్తుండడంతో.... రాక్షసుడికి చిక్కినంత పనైంది. వెంటనే బుట్టలోంచి రొయ్యల పొట్టు తీసి తన వెనుక చల్లింది. అంతే... అక్కడ పెద్ద ఊబిలాంటిది తయారైంది. రాక్షసుడు అందులో చిక్కుకుని బయటకు రావాలని...టిమున్‌ని అందుకోవాలని ఎంతగానో ప్రయత్నించి...చివరికి విఫలుడై...అలా ఊబిలోపలికి కూరుకుపోయాడు. అప్పుడు టిమున్ ఆనందంతో అమ్మానాన్నను చేరుకుంది. వారు సంతోషంగా జీవించారు.

అనుసరణ:
కొమ్మాలపాటి సోహిల్